విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :103 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 2 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

### బటన్ నొక్కడానికి రాలేదు

## పేదలకు భరోసా ఇవ్వడానికే వచ్చా



- పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి
- రెండేళ్లలో పింఛన్లకే రూ.73,500 కోట్లు, సంక్షేమానికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు
- ఆడబిడ్డలకు త్వరలో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం
- రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి

**అమరావతి**

నేను కేవలం పింఛన్లు ఇవ్వడానికి, బటన్ నొక్కడానికి ఇక్కడికి రాలేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పేదలకు భరోసా కల్పించి, వారిలో ధైర్యం నింపేందుకే వచ్చానని ఉద్ఘాటించారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సరిగ్గా 31 ఏళ్ల కిందట ఇదే రోజున తాను మొదటిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంపై కీలక ప్రసంగం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పింఛన్లు అందిస్తున్నామని సీఎం తెలిపారు. గడచిన రెండేళ్లలో పెన్షన్ల కోసమే రూ.73,500 కోట్లు వెచ్చించామని వివరించారు. వివరాలు 2లో..



## భారత జీడీపీ వృద్ధిపై ప్రధాని మోదీ హర్షం

- రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలు
- ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ వీడియో సందేశం
- రాహుల్ గాంధీకి పరోక్ష చురకలు
- విపక్షాల అసత్య ప్రచారాలకు జీడీపీ లెక్కలే సమాధానమన్న మోదీ

### నేడు ఉత్తరాంధ్రకు

## గోదారమ్మ

- సాకారం కానున్న చిరకాల స్వప్నం
- పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- పాయకరావుపేట దార్లపూడి వద్ద సీఎం చంద్రబాబు జలహారతి
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు, కూటమి ప్రజాప్రతినిధులు



**అమరావతి**

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణ ఫలించింది. వారు ఎన్నో ఏళ్లుగా కంటున్న జల కల నెరవేరే శుభ ఘడియలు రానే వచ్చాయి. గోదారమ్మ ఉత్తరాంధ్ర నేలను ముద్దాడే చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి సహా ఉత్తరాంధ్ర జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి జలాలు పరుగులు తీస్తున్నాయి. సెప్టెంబర్ 2న (బుధవారం) అనకాపల్లి జిల్లా పాయకరావుపేట సమీపంలోని దార్లపూడి వద్ద గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అఖండ హారతి ఇవ్వనున్నారు. క్రాస్ రెగ్యులేటర్‌ను ఆన్ చేసి జలాలను విడుదల చేస్తారు. ఈ చారిత్రక ఘట్టానికి కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పాయకరావుపేటలో గోదావరి జలహారతి కార్యక్రమం అత్యంత వైభవంగా జరగనుంది. ఈ కార్యక్రమ ఏర్పాట్లను కూటమి ప్రజాప్రతినిధులు వివరాలు 2లో..



## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు

- 5 కొత్త కేటగిరీలు.. అక్టోబర్ 1 నుంచి రూ.200 ఛార్జీ!
- ఎన్‌పీఎస్ పథకాలకు కొత్త వర్గీకరణ విధానం
- ఈక్విటీ ఆధారంగా ఐదు కేటగిరీలు
- అక్టోబర్ 1 నుంచి రూ.200 చెరిక ఛార్జీ
- రూ.50 చొప్పున నాలుగు విడతల్లో వసూలు

### స్థానిక ఎన్నికలకు

## కసరత్తు

- రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు
- రాష్ట్రంలో మొత్తం 13,278 గ్రామపంచాయతీలన్న ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా
- పోలింగ్ స్టేషన్ల అంశంలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తీసుకున్నామని వ్యాఖ్య




**అమరావతి**

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నారు. మరోవైపు సమగ్ర ఓటర్ల నమోదు ప్రత్యేక జాబితా (సర్) ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ప్రతి పంచాయతీలో ఇంటింటా సర్వే పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల జాబితా తయారీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా కీలక పోలింగ్ కేంద్రాల జాబితా తయారీని పూర్తి చేశారు. గరిష్ఠంగా 650 మంది ఓటర్లను మించకుండా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియను వివిధ జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించారు. ఏపీలో పంచాయతీ ఎన్నికలకు 1,36,326 పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్టు వివరాలు 2లో..

### పట్టణ పేదల సొంతింటి

## కల సాకారం



- ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- పీఎంఏవై-2.0 కింద పట్టణ పేదలకు ఇళ్లు
- ఒక్కో లబ్ధిదారుకు రూ.2.89 లక్షల ఆర్థిక సాయం
- తొలి విడతగా 17,912 గృహాల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి

**అమరావతి**

పేదల సొంతింటి కల సాకారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆర్థిక కారణాల వల్ల నివాస స్థలాలు ఉండి ఇల్లు కట్టుకోలేని వారి ఆశలకు ఇప్పుడు రెక్కలు వచ్చాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-పట్టణ పథకం 2.0 కింద ఇళ్లు మంజూరు కానున్నాయి. దీంతో పట్టణాల్లో ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతగా 17,912 ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ఇందుకోసం రూ.447.80 కోట్లు విడుదల చేసేందుకు సోమవారం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ఈ ఇళ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయనున్నాయి. ఇందులో కేంద్రం వాటా రూ.1.50 లక్షలు కాగా, రాష్ట్రం వాటా రూ.లక్షగా ఉంది. అదనంగా వీబీ జీరామ్‌జీ (ఉపాధి హామీ పథకం) కింద రూ.27,000, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12,000 అదనంగా సమకూరనున్నాయి. మొత్తంగా, ఒక్కో ఇంటి వివరాలు 2లో..



## విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరణ

- కఠిన చర్యలు ఉండవు : జేపీ నడ్డా
- సీజేపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలకు సంబంధించిన కేసులపై కేంద్రం కీలక ప్రకటన
- ఢిల్లీలో నమోదైన అన్ని కేసులను వెనక్కి తీసుకుంటామని నడ్డా వెల్లడి

## సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్‌లు ఎత్తివేత..
- ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు రద్దు
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం
- ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడి



# బటన్ నొక్కడానికి రాలేదు పేదలకు భరోసా ఇవ్వడానికే వచ్చా

-మొదటిపేజీ తరువాయి

అలాగే, మొత్తం సంక్షేమం కోసం రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా వారికి ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పేదల పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందన్నారు. సంక్షేమం అనేది పేదవాడిని నిలబెట్టేలా ఉండాలని సూచించారు.

మహిళా సాధికారత : ఆడబిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బంది పడకూడదని ఉచిత బస్సు ప్రయాణం తీసుకువచ్చామని సీఎం చెప్పారు. రాబోయే రోజుల్లో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. మహిళలకు కష్టం రాకూడదనే ఉద్దేశంతో 'దీపం' పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని 33 శాతం రిజర్వేషన్లు తెచ్చామన్నారు. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తానే తీసుకువచ్చానని, త్వరలో మహిళా డ్రైవర్లను కూడా ప్రోత్సహిస్తామని ప్రకటించారు.

రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు. నరసాపురంలో దేశంలోనే నంబర్ వన్ ఆక్వా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. నిన్ననే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించానని, దానికి రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళు



తున్నామని, కొండలు, గుట్టలు తొలిచి మరీ నీటిని తరలిస్తామన్నారు. నదుల అనుసంధానంతో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఏమాత్రం రావని భరోసా ఇచ్చారు.

**తలసరి ఆదాయం పెంపు**

ప్రస్తుతం మన తలసరి ఆదాయం రూ.3 లక్షలుగా ఉందని, 2047 నాటికి దానిని రూ.54 లక్షలకు చేర్చడమే లక్ష్యమని సీఎం వివరించారు. తలసరి ఆదాయం పెరిగితే ఆటోమేటిక్?గా పేదల సంపద వృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదేనని, ఆ రంగాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకులు కేవలం బటన్లు నొక్కి రోడ్లకు గుంతలు పెట్టారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్సీపీ పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, కానీ కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా పెంచలేదని స్పష్టం చేశారు. తాము ఏ మంచి పని చేసినా వైఎస్సార్సీపీ అడ్డుపడుతోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మెగా డీఎస్సీ వేస్తుంటే దాన్ని అడ్డుకునేందుకు కోర్టులో ఏకంగా 350 కేసులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, మీ పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో అవసరం లేదని తేల్చి చెప్పారు.

**కూటమి ప్రభుత్వ లక్ష్యం**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తపన, అనుభవంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిలో దూసుకెళ్తోందని సీఎం అన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేనని, ఎంత సేవ చేసినా రుణం తీర్చుకోలేనని భావోద్వేగానికి గురయ్యారు. 45 ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు టీడీపీకి అండగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి మరింత వేగంగా జరగాలంటే ప్రజలు తమ సలహాలు, సూచనలు అందించాలని ముఖ్యమంత్రి కోరారు.

# రోల్ మోడల్ నియోజకవర్గం మంగళగిరి

**గుంటూరు :** విద్యా, ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం రూపురేఖలు వేగంగా మారిపోతున్నాయి. ప్రభుత్వ నిధులతో పాటు భారీగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు, పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్షిప్ విధానాలను అనుసంధానిస్తూ వేల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. చేనేత కార్మికుల కోసం ప్రత్యేక బిజినెస్ సెంటర్లు, స్వర్ణకారుల కోసం ప్రత్యేక హబ్, అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, మోడల్ రైతుబజార్లు, విశాలమైన రహదారుల నిర్మాణం వంటి ప్రాజెక్టులతో మంగళగిరిని ఒక రోల్ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. ప్రజాప్రతినిధిగా తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమే అయినప్పటికీ, ఇదే తరహా ప్రాధాన్యత, నిధుల ప్రవాహం రాష్ట్రంలోని మిగిలిన 174 నియోజకవర్గాలకు ఎందుకు లభించడం లేదనే ప్రశ్న రాజకీయంగా, పాలనాపరంగా పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది.భారతీయ రాజకీయాల్లో ముఖ్యమంత్రులు, శక్తివంతమైన మంత్రులు, కీలక నేతలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలకు ఎక్కువ నిధులు తరలడం కొత్తేమీ కాదు. గతంలో కుప్పం, పులివెందుల, గజ్వేల్ వంటి నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి దీనికి నిదర్శనం. అయితే, ప్రభుత్వ అధికారిక బడ్జెట్ పరిమితంగా ఉన్నప్పుడు, ఒకే నియోజకవర్గానికి ప్రాధాన్యత పెరిగితే సహజంగానే ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి మందగిస్తుందనే ఆందోళన స్థానిక శాసనసభ్యుల్లోనూ, ప్రజల్లోనూ వ్యక్తమవుతుంది. సమాన వికేంద్రీకరణ జరగకపోవడం వల్ల ప్రాంతీయ అసమానతలు పెరిగే ప్రమాదం ఉందిమంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధికి కేవలం ప్రభుత్వ బడ్జెట్ ఒక్కటే కారణం కాదు. నారా లోకేష్ తనకున్న ఐటి మంత్రి హోదా, కార్పొరేట్ సంస్థలతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించి భారీగా సిఎస్ఆర్ నిధులను, పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నారు. పీఫోర్ మోడల్ ద్వారా ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారు. అయితే, రాష్ట్రంలోని సాధారణ ఎమ్మెల్యేలకు లేదా మంత్రులకు ఇటువంటి కార్పొరేట్




నెట్‌వర్కింగ్ లేదా పెట్టుబడులను ఆకర్షించే అవకాశం లేకపోవడం వల్ల వారు కేవలం ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇది నియోజకవర్గాల మధ్య అభివృద్ధి వ్యత్యాసానికి ప్రధాన కారణమవుతోంది.2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి లోకేష్ ఓటమి పాలైనప్పటికీ, ఆ తర్వాత నియోజకవర్గంలోనే ఉంటూ సొంత నిధులతో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి 2024లో భారీ మెజారిటీతో విజయం సాధించారు. తన రాజకీయ భవిష్యత్తుకు, నాయకత్వ పటిమకు మంగళగిరిని ఒక షోకేస్ గా మార్చాలనేది ఆయన వ్యూహం. ఈ మోడల్ ద్వారా తాను కేవలం ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా అభివృద్ధి ప్రదాతనని నిరూపించుకోవాలని భావిస్తున్నారు. అయితే, ఇది అధికార పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలపై ప్రజా ఒత్తిడిని పెంచుతోంది. మా ఎమ్మెల్యే కూడా లోకేష్ లాగా నిధులు ఎందుకు తేలేకపోతున్నారు అనే ప్రశ్న సాధారణ ప్రజల నుంచి వస్తోంది.మంగళగిరిలో అమలు చేస్తున్న సిఎస్ఆర్, పీఫోర్ , ఇన్నోవేటివ్ ఉపాధి నమూనాలు . అయితే, ఈ మోడల్ కేవలం ఒక్క నియోజకవర్గానికే పరిమితం కాకూడదు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక విధివిధానాన్ని రూపొందించి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాలలో ప్రాధాన్యత ఆధారంగా ఊఖీ నిధులను సమంగా పంపిణీ చేసే వ్యవస్థను తీసుకురావాలి. ప్రతి జిల్లాకు లేదా నియోజకవర్గానికి పెట్టుబడులను ఆకర్షించేలా స్థానిక ఎమ్మెల్యేలకు సాంకేతిక, పాలనాపరమైన మద్దతును ప్రభుత్వం అందించినప్పుడే మంగళగిరి అభివృద్ధి మోడల్ సక్సెస్ అయినట్లు అనుకోవచ్చు.

# మూడు మేయర్ సీట్లపై కమలం పార్టీకి పట్టు

**విశాఖపట్టణం :** ఇటు టీడీపీ. ఇటు జనసేన. కూటమిలోని ఈ రెండు పార్టీలు.. స్థానిక ఎన్నికలపై ఎవరి లెక్కల్లో వారు బిజీగా ఉన్నారు. బీజేపీ కూడా సైలెంట్‌గా ఉంటూనే పకడ్బందీ ప్లానింగ్స్ చేస్తోందట. కార్పొరేషన్ ఎన్నికల్లో డైరెక్ట్ ఫైట్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాలకు పదును పెడుతోందట కమలం పార్టీ. విశాఖ మేయర్ పీఠంపై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టిందట. ఏపీ నగర పాలక సంస్థల్లో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అతిపెద్దది. 125 డివిజన్ల డీలిమిటేషన్ ప్రాసెస్ కూడా జరగబోతోంది. విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి జిల్లాలో విస్తరించి ఉంది. అందుకే ఇక్కడ మేయర్ పీఠం అంటే దాదాపు క్యాబినెట్ మంత్రితో సమానం అన్నట్లుగా భావిస్తున్నారు.ఆంధ్ర ప్రదేశ్ వార్తలుఏడాదికి ఐదారు వేల కోట్ల బడ్జెట్ ఉండే గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పీఠం అంటే చాలా పెద్ద పదవి అనే చెప్పొచ్చు. ప్రత్యక్ష ఎన్నికలు జరగబోతుండటంతో తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దించాలని మూడు పార్టీలు ఆశిస్తున్నాయి. బీజేపీ ఈ మేయర్ పీఠాన్ని తమకు విడిచి పెట్టాలని కోరాలని డిసైడ్ అయిందట.1979లో కాంగ్రెస్ పార్టీతో పోటీపడి మరీ ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని సొంతం చేసుకుంది బీజేపీ. అప్పుడు జనసంఘ్ రూపంలో ఉన్న బీజేపీ.. తొలిసారి విశాఖ మేయర్ అభ్యర్థిని గెలిపించుకొని హిస్టరీ క్రియేట్ చేసింది. ఇప్పటికీ విశాఖ నగరంలో బీజేపీకి మంచి పట్టు ఉన్నట్లు చెబుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖ ఎంపీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం నడిచింది. కాని పొత్తుల్లో భాగంగా పక్కనున్న అనకాపల్లి స్థానం బీజేపీకి దక్కగా.. అక్కడి నుంచి కమలం పార్టీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్ గెలిచారు. విశాఖ గ్రేటర్ పరిధి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా



కొంత విస్తరించి ఉంటుంది. దీంతో తమకు గ్రేటర్ పీఠం ఇస్తే ఈజీగా గెలుచుకోవచ్చనే అంచనాల్లో ఉందట కమలం పార్టీ. సేమ్‌టైమ్ గత ఎన్నికల్లో తమకు విశాఖ ఎంపీ సీటు ఇవ్వకపోవడంతో.. ఇప్పుడు మేయర్ పీఠం అయినా వదిలేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారు బీజేపీ నేతలు.విశాఖ మేయర్ సీటుతో పాటు.. విజయవాడ, తిరుపతి నగర పాలక సంస్థలపై కూడా బీజేపీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గ్రేటర్ విశాఖ పరిధిలో బీజేపీకి ఓ ఎమ్మెల్యే, మరో ఎంపీ ఉన్నారు. 2014లో కూడా విశాఖ ఎంపీ సీటును బీజేపీ గెలిచింది. దీంతో తమకు పట్టున్న చోట మేయర్ సీటు దక్కించుకొని.. ఇంకా బలం పెంచుకునే ప్లాన్‌లో ఉన్నారట కమలనాథులు. ఇక గత ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సీటును గెలుచుకున్న బీజేపీ.. బెజవాడ మేయర్ సీటుకోసం పట్టుబట్టేందుకు రెడీ అవుతోందట. తిరుపతి మేయర్ స్థానం కూడా తమకే ఇవ్వాలని కోరబోతోందట. కూటమి పెద్దల భేటీలో తమ వాదనను బలంగా వినిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. స్టేట్ మొత్తంలో అర్బన్ ఏరియాల్లో తమ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవుల్లో పార్టీకి తగిన ప్రాధాన్యం దక్కేలా సీట్ల సర్దుబాట్లపై దృష్టి పెట్టాలని బీజేపీ డిసైడ్ అయిందట.రాష్ట్రంలో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 88 మున్సిపాలిటీలు, 18 నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవుల పంపకంపై ఇప్పటి నుంచే రాజకీయ చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా విశాఖతో పాటు విజయవాడ, తిరుపతి నగరాలు రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మికంగా కీలకమైనవి కావడంతో ఇక్కడ మేయర్ పీఠాలను దక్కించుకుంటే పార్టీకి సంస్థాగతంగా, రాజకీయంగా మరింత ప్రయోజనం ఉంటుందని బీజేపీ అంచనా వేస్తోందట.పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, స్థానిక బలాబలాలు వంటి సమీకరణలు మేయర్ అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రలో తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని బీజేపీ నేతలు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌పై ఒత్తిడి తెస్తున్నారట. అసెంబ్లీ ఎన్నికల్లో సర్దుబాట్ల కోసం ఫాలో అయిన విధానం కాకుండా.. ఇప్పుడు స్థానికంగా పార్టీల బలం, అభ్యర్థుల సామర్థ్యం, వార్డుల వారీగా సమీకరణాలను లెక్కలులోకి తీసుకోవాల్సి ఉంటుంది. విశాఖ, విజయవాడ, తిరుపతి మేయర్ పీఠాల కోసం బీజేపీ పట్టుబడితే.. కూటమిలోని టీడీపీ, జనసేన నుంచి స్పందన ఎలా ఉంటుందో.. కమలం పార్టీ ఆశించినట్లు మేయర్ సీట్లు దక్కుతాయో లేదో చూడాలి మరి.

## స్థానిక ఎన్నికలకు కసరత్తు

-మొదటిపేజీ తరువాయి

ఎస్ఈసీ అనిల్?చంద్ర పునేఠా వెల్లడించారు. మొత్తం గ్రామపంచాయతీలు 13,278 ఉన్నాయని వివరించారు. అందులో వార్డులు 1,33,128 ఉన్నట్లు తెలిపారు. అన్ని జిల్లాలలోనూ సమగ్రంగా జిల్లా కలెక్టర్లు పోలింగ్ స్టేషన్లు నిర్ణయించారని చెప్పారు. వీటిపై జిల్లాలో అన్ని స్థాయిల్లో ఆగస్టు 23 నుంచి 26 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్?లు తీసుకున్నారని, తుదిగా ఈ సంఖ్య నిర్ణయించినట్లు అనిల్?చంద్ర పునేఠా పేర్కొన్నారు.

మరోవైపు 61 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియ మొదలైంది. సెప్టెంబర్? 3న తుది జాబితాలు ప్రకటిస్తారు. రిజర్వేషన్లు ప్రకటించేందుకు అవసరమైన ఎస్సీ, ఎస్టీ, బీసీల వివరాలను వాటిలో నుంచి గుర్తించనున్నారు. అదేవిధంగా డివిజన్లు, వార్డుల పునర్విభజనపై హైకోర్టులో తాజాగా వేసిన కేసులు, వైఎస్సార్సీపీ సర్కార్?లో పంచాయతీలను నగర పంచాయతీలుగా ఉన్నతీకరించడం, పంచాయతీలు సమీప పుర, నగరపాలక సంస్థల్లో విలీనానికి వ్యతిరేకంగా వేసిన కేసులు కొలిక్కి వచ్చాక మరో 62 నగరాలు, పట్టణాల్లోనూ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు అదనంగా 1.50 లక్షల బ్యాలట్ బాక్సుల కోసం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా లేఖలు రాశారు. ఆంధ్రప్రదేశ్?లో 50వేలకు పైగా బ్యాలట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. ఒకే నెలలో స్థానికసంస్థలకు వరుసగా ఎన్నికలు నిర్వహించాలంటే 2 లక్షల వరకు బాక్సులు అవసరమని అంచనా.

పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో మొదట ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసి సెప్టెంబర్ రెండోవారంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు కలెక్టర్ల ద్వారా గెజిట్ నోటిఫికేషన్లు అందించాలన్న యోచనతో ఉన్నట్లు తెలిసింది. అనంతరం ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. రెండోదశలో పరిషత్ ఎన్నికలు, మూడోదశలో పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం.

## నేడు ఉత్తరాంధ్రకు గోదారమ్మ

-మొదటిపేజీ తరువాయి

ముమ్మరంగా పర్యవేక్షించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, బెందాళం అశోక్ క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించారు. ఎల్ఎంసీ క్రాస్ రెగ్యులేటర్ గేట్లు, పైలాన్, ఘాట్ రోడ్ల పనులను పర్యవేక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కాలువ ద్వారా తొలి విడతగా 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. తద్వారా సుమారు 46,620 ఎకరాలకు సాగునీరు అందనుంది. గోదావరి జలాల రాకతో వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలు తీరుతాయని నేతలు ఆనందం వ్యక్తం చేశారు.

**కొండలను తొలిచి**

పోలవరం జిల్లా నేలకోట వద్ద ప్రారంభమయ్యే ఈ ఎడమ కాలువ, విశాఖ జిల్లాలోని మేఘాద్రిగెడ్డ వరకు కొనసాగుతుంది. ఈ కాలువ మొత్తం పొడవు 213 కిలోమీటర్లు. అందులో ఉమ్మడి విశాఖ జిల్లాలోనే 112 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాయకరావుపేట నుంచి రాంబిల్లి వరకు 51.1 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణాన్ని కేవలం 26 నెలల్లోనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ముఖ్యంగా పాయకరావుపేటలోని తాండవ వద్ద సగటున 76 మీటర్ల ఎత్తు ఉన్న కొండలను రెండు కిలోమీటర్ల మేర తొలిచి కాలువ నిర్మించడం ఓ ఇంజినీరింగ్ అద్భుతం.

**కాంక్రీట్ కవచాల్లా అక్విడక్టులు**

గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వైపు పరుగులు పెట్టించే క్రమంలో ప్రకృతి సృష్టించిన అడ్డంకులను సైతం అధిగమించారు. అడ్డుగా వస్తున్న వరాహ, పంపా, తాండవ నదులను దాటేలా అద్భుతమైన కాంక్రీట్ కవచాలతో అక్విడక్టులను నిర్మించారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద వరాహ నదిపై రూ.160 కోట్ల వ్యయంతో భారీ అక్విడక్టు నిర్మించారు. గత టీడీపీ హయాంలోనే ఇది మూడొంతులు పూర్తి కాగా, వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ పరుగులు పెట్టించింది. 1.125 కిలోమీటర్ల పొడవునా 93 పిల్లర్లతో దీనిని నిర్మించారు. ఇందులో ఉన్న మొత్తం 6 కాలువల్లో (ట్రఫ్ వెంట్స్) మూడింటిని నీటి విడుదలకు సిద్ధం చేశారు.

**విద్యార్థులకు ప్రాజెక్టు విశేషాలు**

పోలవరం ప్రాజెక్ట్ ప్రాముఖ్యతను, దీని చారిత్రక నేపథ్యాన్ని భావితరాలకు తెలియజేసేందుకు రాష్ట్ర హోంమంత్రి అనిత ప్రత్యేక చొరవ చూపారు. పాయకరావుపేటలోని పాఠశాల విద్యార్థులను ఆమె స్వయంగా కాలువ నిర్మాణ ప్రాంతానికి తీసుకువెళ్లారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు ఎలా వస్తుంది? అక్విడక్టులు ఎలా కట్టారు? అనే విషయాలను అధికారుల ద్వారా విద్యార్థులకు వివరింపజేశారు. మ్యాప్‌ల ద్వారా ఇంజినీరింగ్ అద్భుతాలను ప్రత్యక్షంగా తెలుసుకున్న విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

"ఉత్తరాంధ్ర సుజల స్రవంతి స్వప్నం సీఎం చంద్రబాబు కృషితో సాకారమవుతోంది. దశాబ్దాల కలను నిజం చేస్తూ గోదావరి జలాలు మన ముంగిటకు రావడం అత్యంత సంతోషకరం. ఈ చారిత్రక ఘట్టాన్ని విద్యార్థులు కూడా తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే వారిని ఇక్కడికి తీసుకువచ్చాం."

"గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశాం. ఈ జలాలతో ఉత్తరాంధ్ర వ్యవసాయ, పారిశ్రామిక రూపురేఖలు మారిపోతాయి."

## పట్టణ పేదల సొంతింటి కల సాకారం



-మొదటిపేజీ తరువాయి

నిర్మాణానికి ప్రభుత్వాలు రూ.2.89 లక్షల మొత్తాన్ని ఇస్తున్నాయి. ఇకపై పీఎంఏవై-2.0 కింద పట్టణ పేదల కోసం కేంద్రం మంజూరు చేసిన ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సకాలంలో కేటాయించనుంది.

**జిల్లా వారీగా కేటాయింపు**

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 17,912 గృహాలను జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. వీటిలో 15,793 ఇళ్లు పట్టణ స్థానిక సంస్థల (యూఎల్?బీ)ల పరిధిలోకి రాగా, మిగిలిన 2,119 ఇళ్లు పట్టణాభివృద్ధి సంస్థల (యూడీఏ)ల పరిధిలోకి వస్తాయి. అత్యధికంగా అనంతపురం జిల్లాకు 1,387 ఇళ్లు కేటాయించాయి. ఆ తర్వాతి స్థానాల్లో పల్నాడు (1,229), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (1,057), వైఎస్సాఆర్ కడప (1,053) జిల్లాలు ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాకు అత్యల్పంగా 212 ఇళ్లు మంజూరు అయ్యాయి. వీటి నిర్మాణానికి ఆయా జిల్లాల కలెక్టర్లు అనుమతులు మంజూరు చేస్తారు.

**లబ్ధిదారుల ఇష్టప్రకారమే నిర్మాణం:**

ఇంటి నిర్మాణానికి సంబంధించి కార్పెట్ కనీసం 30 చదరపు మీటర్ల నుంచి గరిష్టంగా 45 చదరపు మీటర్ల మధ్య ఉండాలి. నిర్దేశిత ప్రాంతంలో నిర్మాణానికి వీలుగా ప్రభుత్వం లబ్ధిదారులకు నమూనా డిజైన్లను అందుబాటులో ఉంచుతుంది. లబ్ధిదారులు వారి స్థల పరిస్థితులకు అనువైన డిజైన్‌ను ఎంచుకోవచ్చు. ప్రభుత్వాల నుంచి ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ కానుంది.

# ఉత్తరాంధ్రకు మహర్దశ కొలుసు





- పోలవరం ఎడమ కాలువ ద్వారా సుజల స్రవంతి పనుల్లో పురోగతి.
- పోలవరం ఎడమ కాలువ అనుసంధానం 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 6 లక్షల మందికి తాగునీరు.
- సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి.

**పాయకరావుపేట, పెన్ సత్తా, సెప్టెంబర్ 01:** రాష్ట్ర ప్రజల 50 ఏళ్ల కల అయిన పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి, లక్షలాది మంది రైతులకు ఉత్తరాంధ్ర ప్రజలకు సాగు, తాగునీరు అందించడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని వెల్లడించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుతో పోలవరం ఎడమ కాలువను అనుసంధానించడం ద్వారా ఈ ప్రాంత స్వరూపమే మారబోతోందని సమాచార, పౌర సంబంధాల శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు.

పాయకరావు పేట లో రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించబోయే బహిరంగ సమావేశ వేదిక వద్ద మంగళవారం సాయంత్రం పత్రికా ప్రతినిధులతో సమావేశం అయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి పార్థ సారథి మాట్లాడుతూ 2014-2019 మధ్య కాలంలో పోలవరం ప్రాజెక్టు పనులు 73% నుండి 74% వరకు పూర్తయ్యాయి. అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన 2019-2024 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తీవ్ర అసమర్థత వల్ల 5 ఏళ్లలో కనీసం 10% పనులు కూడా పూర్తి చేయలేకపోయింది. వారి తప్పిదాలు, సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ తీవ్రంగా ధ్వంసమై, మళ్లీ కొత్తగా నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వెలిగొండ వంటి ప్రాజెక్టులలో హెచ్‌డిపిఇ పైప్‌లైన్లు వేసి, గ్రీన్ కార్పెట్లు పరిచి, ట్యాంకర్ల ద్వారా నీటిని తోడి కాలువల్లో పోసి నీళ్లిచ్చినట్లు చూపించే ప్రయత్నం చేశారని విమర్శించారు. భూనిర్వాసితులకు, బాధితులకు నష్టపరిహారం ఇవ్వకుండా ప్రాజెక్టులను జాతికి అంకితం చేశామని చెప్పుకోవడం మోసపూరిత మైన ఆలోచన అని పేర్కొన్నారు.

పోలవరం ఎడమ కాలువ - అంచనా వ్యయం: రూ. 4,592 కోట్లతో సుమారు 232 కిలో మీటర్లు నిర్మించడం జరిగిందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం చేయడం ద్వారా మొత్తం 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఆయకట్టు స్థిరీకరణ కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాలలో 4 లక్షల ఎకరాల స్థిరీకరణ జరుగుతుందని చెప్పారు. తాగునీటి సరఫరా సుమారు 5.5 లక్షల నుండి 6 లక్షల మంది ప్రజలకు తాగునీటి అవసరాలు తీరుతాయని పారిశ్రామిక అభివృద్ధి కోసం 28 టీఎంసీల నీటిని కేటాయించడం జరుగుతుంది. ఎత్తైన కొండలను తొలగించడం, బలహీన మైన నేలల్లో భారీ పునాదులు నిర్మించడం వంటి అనేక సాంకేతిక సవాళ్లను అధిగమించి ఎడమ కాలువ నిర్మాణాన్ని వేగవంతం చేసామన్నారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర అభివృద్ధికి పునాదులు వేస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర వికాసం లో భాగముగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో పాటు, విశాఖపట్నాన్ని దేశంలోనే ప్రముఖ డేటా సెంటర్ల హబ్, ఐటీ/పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. రాయలసీమను దేశంలోనే నంబర్-1 హార్టికల్చర్ హబ్ (ఉద్యానవన హబ్), ఇండస్ట్రియల్ కారిడార్, సోలార్ ఎనర్జీ హబ్‌గా మారుస్తున్నామని, ప్రజలిచ్చిన బాధ్యతను ఆశీస్సుగా స్వీకరించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రులు





**నేడు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల చారిత్రాత్మక ఘట్టం.**

**పాయకరావుపేట, పెన్ సత్తా, సెప్టెంబర్ 01:** ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకువచ్చే ప్రతిష్టాత్మక కార్యక్రమానికి పాయకరావుపేట వేదిక కానుంది. నేడు సెప్టెంబర్ 2 న (బుధవారం) పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల సందర్భంగా నిర్వహించనున్న జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో జలహారతి కార్యక్రమంతో పాటు బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, పోలవరం ఎడమ కాలువ వద్ద జలహారతి నిర్వహించనున్న ప్రాంతాన్ని మంగళవారం సందర్శించారు. జలహారతి కార్యక్రమం, బహిరంగ సభ ఏర్పాట్ల పై అధికారులకు మంత్రి వంగలపూడి అనిత పలు సూచనలు చేశారు. వేలాది మంది రైతులు, ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యల పై పోలీసు అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఘన స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రులు సూచించారు. ఈ కార్యక్రమం లో ఏర్పాట్ల పరిశీలనలో శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యం మాన్ పటేల్ తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# సీఎం సభకు భారీ జన సమీకరణ

**నక్కపల్లిలో టీడీపీ నేతల సమీక్ష**






**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 01:**పాయకరావుపేట నియోజకవర్గం లో పోలవరం ప్రాజెక్ట్ జలహారతి ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా నేడు జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభను విజయవంతం చేసేందుకు టీడీపీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించేందుకు చేపట్టాల్సిన చర్యలు, జన సమీకరణ, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై మంగళవారం టీడీపీ నాయకులు ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశం పత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ, నియోజకవర్గ అబ్జర్వర్ సమక్షంలో, పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి సభకు నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.

సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బస్సులు, ఇతర రవాణా సౌకర్యాల ఏర్పాటు, గ్రామాల వారీగా జన సమీకరణ, నాయకులు--కార్యకర్తల సమన్వయం, సభా ప్రాంగణానికి ప్రజలను తరలించే విధానం తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

సభ విజయవంతానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను సభకు తరలించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.ఈ సమావేశంలో నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించాలి



**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 01:** అనకాపల్లి జిల్లా లో నేడు నెలకొని ఉన్న తీవ్రమైన వర్షాభావ పరిస్థితిలు రీత్యా అనకాపల్లి జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రైతు సంఘ నాయకులు ఎం అప్పలరాజు కోరారు. మంగళవారం నక్కపల్లి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల చేసే జలహారతి కార్యక్రమానికి పాయకరావుపేట వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లా నే కర్నూలు జిల్లాగా ప్రకటన చేయాలని కోరారు.

ఖరీఫ్ సీజన్ జూలై నుండి సెప్టెంబర్ వరకు ఉంటుంది,ఈ సంవత్సరం ఆగస్టు నెల పూర్తి అయిన వర్షాలు పడకపోవడం వలన ఖరీఫ్ సీజన్ లో పంటలు వేయడానికి అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. వర్షపాతం 20 శాతం నుండి 50 శాతం వరకు మాత్రమే పడితే అది సాధారణ కరువు,60 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైతే అది తీవ్రమైన కరువుగా పరిగణలోకి తీసుకుని ప్రస్తుతం అనకాపల్లి జిల్లా లో 60 శాతం లోటు వర్ష పాతం ఉందని దీంతో తీవ్రమైన కరువు గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో ప్రతీ సంవత్సరం ఒక లక్షా ముప్పై ఐదు వేల ఎకరాల్లో వరి పంటలు పండిస్తున్నారు. ఏడాది వర్షా బావ పరిస్థితి వల్ల వరి పంటలో వేసే అవకాశం లేదన్నారు.జిల్లాలో ఉన్న తాండవ, పెద్దేరు, కళ్యాణపులోవ,కోణాం,రైవాడ జలాశయాల్లో నీరు లేక అడుగంటి పోయాయని ఇది కూడా తీవ్రమైన కరువు పరిస్థితిలకు కారణంగా పేర్కొన్నారు.ఈ పరిస్థితులను రాష్ట్ర ముఖ్యమంత్రి పరిగణనలోకి తీసుకొని బుధవారం అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట పర్యటనకు వస్తున్న చంద్రబాబు అనకాపల్లి జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ చేసి కొత్తగా రుణాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని అన్నారు.

రైతులకు, కూలీలకు రోజులతో సంబంధం లేకుండా ఉపాధి పనులు కల్పించాలని పశుగ్రాసం ఉచితంగా అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, మండల కమిటీ సభ్యులు ఎం.మహేష్ బాబు,పి.రమణ,కె.కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు కానుకగా పాఠశాలకు 6 కుర్చీలు, ఒక ఫ్యాన్ అందజేత

**నక్కపల్లి పెన్ సత్తా, సెప్టెంబర్ 01::**రాజీపేట గ్రామానికి చెందిన వాసుపల్లి శివ గారి కుమారుడు వాసుపల్లి ప్రభ పుట్టినరోజు సందర్భంగా రాజయ్యపేట ఎంపీపీ పాఠశాలకు ఉపయోగపడే విధంగా 6 కుర్చీలు మరియు ఒక ఫ్యాన్‌ను కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు

.పుట్టినరోజు వేడుకలను కేవలం వ్యక్తిగత వేడుకగా కాకుండా, విద్యార్థులకు ఉపయోగపడేలా సామాజిక సేవా కార్యక్రమంగా నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాజయ్యపేట తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు గారు, యూనిట్ ఇంచార్జ్ వాసుపల్లి శివ గారు, వైస్ ప్రెసిడెంట్ సిరిపల్లి అప్పలరాజు గారు, ఐటీడీపీ జిల్లా కమిటీ సభ్యులు రాంబాబు గారు, యజ్జల లోవరాజు గారు, గోసల కిషోర్, రాజయ్యపేట ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. సన్యాసి రావు , ఉపాధ్యాయులు ఈ. మాధవి గారు, పి. దేవానంద్ , బండారు కొండలరావు , వై. కృష్ణ పి. చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పెన్ సత్తా
బుధవారం 2 సెప్టెంబర్ 2026

## పోలవరం జలాలతో ఉత్తరాంధ్రకు కొత్త కళ




**అచ్యుతాపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 01:** పోలవరం ప్రాజెక్టు నీటిని ఉత్తరాంధ్రకు మళ్లించడం ద్వారా ఈ ప్రాంతంలోని సాగుభూములకు భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఏపీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కట్టుమూరి చిట్టేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు చేరితే సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం పీఎల్‌పురం వద్ద 2న సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జలహారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రైతులు, మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ట్రాఫిక్ కష్టాలకి చెక్- 2.6 కోట్లతో ఇచ్చాపురం రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభం.



**ఇచ్చాపురం పెన్ సత్తా, సెప్టెంబర్ 01:** ఇచ్చాపురం పట్టణంలో రైల్వే గేట్ వద్ద2.6 కోట్లతో మంగళవారం అండర్ పాస్ పనులు ప్రారంభమయ్యాయి.ఈ గేటు వద్ద ఎల్లప్పుడూ ఏర్పడే ట్రాఫిక్ సమస్యకు స్థానిక ప్రజలు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం.గత కొన్నేళ్లుగా ఉన్న ఈ సమస్యను కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే బెందాలం.అశోక్ బాబు చొరవతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో అండర్ పాస్ నిర్మాణానికి మార్గం సుగమం అయిందని జెడ్ఆర్ యుసి మెంబర్ శ్రీనివాస రౌలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాళ్ళ.ధర్మారావు, కాళ్ళ.గోపి,జయదేవ్,కృష్ణ, చంద్రశేఖరం తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లోనే కాదు సేవలోనూ ఆదర్శం.

డయాలసిస్ పేషెంట్ కు హాస్పిటల్ కి వెళ్లి పెన్షన్ అందజేసిన రెవెన్యూ ఉద్యోగి



**సోంపేట పెన్ సత్తా, సెప్టెంబర్ 01:**అనారోగ్యంతో హాస్పిటల్లో డయాలసిస్ చేయించుకుంటున్న పేద మహిళ బొగిడియాపుట్టుగ చెందిన మహాలక్ష్మి కు బొరివంక రెవెన్యూ అధికారి గుర్రాల.దివాకర్ పెన్షన్ అందజేసి మానవత్వం చాటుకున్నారు.పెన్షన్ తీసుకోవడానికి రాలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలుసుకొని స్వయంగా సోంపేట హాస్పిటల్ కి వెళ్లి పెన్షన్ నగదును మంగళవారం అందజేశారు.దీంతో పేషెంట్ కుటుంబ సభ్యులు ఉద్యోగికి కృతజ్ఞతలు తెలిపారు.ఆ ఉద్యోగి సేవలకు స్థానికులు మరియు రెవెన్యూ సిబ్బంది "దివాకర్" విధుల్లోనే కాదు సేవలోను ఆదర్శమని అభినందించారు.

## శేమునపల్లి లో భారీ చోరి....





**చోడవరం పెన్ సత్తా, సెప్టెంబర్ 01::**మండలం లోని శేమునాపల్లి గ్రామం లో బంగారం చోరీ యల్లపు అప్పారావు ఇంట్లో రాత్రి గుర్తు తెలియని దుండగలు
సుమారు 10 తులాలు బంగారం, 10 వేలు నగదువఅపహారణ
నిన్న విజయవాడ వెళ్లిన బాధిత కుటుంబ సభ్యులు బాధిత కుటుంబం సభ్యులు ఫిర్యాదు మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్న చోడవరం పోలీసు వారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది...

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కట్టుదిట్ట మైన భద్రతా ఏర్పాట్లు.





క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ.

**పాయకరావుపేట, పెన్ సత్తా, సెప్టెంబర్ 01:** పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల సందర్భంగా నిర్వహించనున్న ప్రతిష్టాత్మక జలహారతి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు (సెప్టెంబర్ 2 న) అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారు.

ఈ పర్యటన నేపథ్యంలో మంగళవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. జలహారతి ప్రాంగణం, పి.ఎల్.పురం లోని బహిరంగ సభా వేదిక, హెలిప్యాడ్, వీఐపీ కాన్వాయ్ మార్గాలను ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించిన ఎస్పీ, అనంతరం జగతా కళ్యాణ మండపంలో పోలీసు అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బందోబస్తు విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అత్యంత అప్రమత్తత, నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు.

సెక్టార్ వారీ బాధ్యతలు: బందోబస్తును సెక్టార్ల వారీగా విభజించి, సంబంధిత సెక్టార్ ఇన్‌స్పెక్టర్లకు, సిబ్బందికి వారి విధివిధానాలు, బాధ్యతల పై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రజా సౌకర్యం ఉ ట్రాఫిక్ నియంత్రణ, ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే అశేష జనవాహినికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలి. సభా ప్రాంగణం, జలహారతి ప్రాంతాలకు ప్రజలు సులభంగా చేరుకునేలా మార్గాలను సుగమం చేయాలి. శాఖల సమన్వయంతో వీఐపీ బందోబస్తు, కార్యక్రమాన్ని ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయాలి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మండ జావలి ఆల్ఫోన్స్, (రంపచోడవరం ప్రత్యేక అధికారి),



అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు, ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎల్.శేషాద్రి, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఏ.ఆర్ డీఎస్పీ కె.రవికుమార్, సీఐ వినోద్ బాబు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పవన్ జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు!



జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు పట్టణంలోని ఛత్రపతి శివాజీ కూడలి వద్ద జనసేన నాయకులు, కార్య కర్తలు అభిమానులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తు న్నారు. ముస్తాబవుతున్న శివాజీ సెంటర్: పట్టణంలోనే అత్యంత కీలకమైన ఛత్రపతి శివాజీ సెంటర్ను ఫ్లెక్సీలు, జనసేన పార్టీ జెండాలు, డిజిటల్ కటౌట్లతో ఎరుపు, తెలుపు వర్ణమయంగా తీర్చిదిద్దుతున్నారు. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న మొదటి జన్మదిన వేడుక కావడం, జనసేన యువజన విభాగం ప్రారంభ ప్రకటన కూడా ఉండటంతో అభిమానుల ఉత్సాహం రెట్టింపైంది.బర్త్డే వేడుకల్లో భాగంగా బుధవారం ఛత్రపతి శివాజీ కూడలి వద్ద పలు వినూత్న, సేవా కార్యక్రమాలు నిర్వహిం చేందుకు సిద్ధమవుతున్నారు. అభిమానులు మరియు జనసేన నాయకుల సమక్షంలో భారీ కేక్ కటింగ్ జరగనుంది.స్థానిక నిరుపేదలకు, బాటసారులకు అన్నదాన కార్యక్రమాలు ఆసుపత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ చేపడుతున్నారు. పేదలకు చీరలు పంపిణీ చేయను న్నారు. పట్టణంలోని జనసైనికులు, వీర మహిళలు అభిమానులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, మండల అధ్యక్షుడు, సొసైటీ ఛైర్మన్ అడపా ప్రసాదు, పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబి, చాపల రమేష్, ఎన్వీ సత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి సజ్జా సుబ్బు, ముఖేశ్,నేలపాల దినేష్, దాగారపు శ్రీను ఏర్పాట్ల ను పర్యవేక్షించారు.

# యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ లో ఇండక్షన్ ప్రోగ్రామ్





జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ (జె ఎన్ టి యు కే) పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యు సి ఈ కె)లో నూతనంగా ప్రవేశం పొందిన 2026-27 విద్యా సంవత్సరపు ప్రథమ సంవత్సరం బి.టెక్ విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రామ్ ను సోమవారం కళాశాల అలూమ్ని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సాదరంగా ఆహ్వానించడం, కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా వాతావరణం, అవకాశాలు, వసతులు మరియు విద్యార్థి సహాయ వ్యవస్థలను పరిచయం చేయడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా జరిగింది.ఈ కార్యక్రమానికి మాజీ ఐ ఏ ఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెఎన్టీయూకే గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మ రాజు, వైస్ ప్రిన్సిపాల్స్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, నూతనంగా ప్రవేశం పొందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.ముఖ్య అతిథి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడుతూ, విద్యార్థులు తమలో ఆత్మవిశ్వాసం, విమర్శనాత్మక ఆలోచనా విధానం (జతీఓఱఞశ్రీ ఎష్ట్రఱఅఎఱఅస్త్ర), సమస్య పరిష్కార నైపుణ్యాలను (ఫ్రాతీశీఎశ్రీవఎ-వాశీశ్రీజఱఅస్త్ర వాఎఱశ్రీశ్రీం) పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు తమపై నమ్మకం పెంచుకోవడంతో పాటు, ప్రశ్నలు అడిగే అలవాటును పెంపొందించుకోవాలని, ఏ అంశాన్నైనా లోతుగా అర్థం చేసుకోవాలని, స్వతంత్రంగా ఆలోచిస్తూ నేర్చుకునే విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత విద్యతో పాటు భవిష్యత్ వృత్తి జీవితంలో లాజికల్ థింకింగ్, క్రియేటివిటీ, ప్రాబ్లమ్-సాల్వింగ్ ఎబిలిటీస్ ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తులను గుర్తించి, వారికి నచ్చిన రంగాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రోత్సహించాలని, ఎదురయ్యే సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేలా వారికి సహకరించాలని డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ సూచించారు.జెఎన్టీయూకే గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ గారు నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ, ఇంజనీరింగ్ విద్యలో క్రమశిక్షణ, ఆవిష్కరణలు, పరిశోధన మరియు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జెఎన్టీయూకే లో అందుబాటులో ఉన్న విద్యా వనరులు, ప్రయోగశాలలు, పరిశోధన అవకాశాలు మరియు ఇతర సౌకర్యాలను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మ రాజు గారు విద్యార్థులు, తల్లిదండ్రలకు స్వాగతం పలికి, కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా కార్యక్రమాలు, మౌలిక వసతులు, ప్రయోగశాలలు, విద్యార్థి సహాయ వ్యవస్థలు, సహపాఠ్య మరియు అదనపు పాఠ్య కార్యక్రమాలు, కెరీర్ అభివృద్ధి అవకాశాల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్స్ మరియు వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులకు విద్యా ప్రణాళిక, కళాశాల జీవితం, నైపుణ్యాభివృద్ధి మరియు భవిష్యత్ కెరీర్ అవకాశాలపై విలువైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యాసంస్థల మధ్య మరింత సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచడంలో ఈ ఇండక్షన్ ప్రోగ్రామ్ దోహదపడింది.

# భారత జీడీపీ వృద్ధిపై ప్రధాని మోదీ హర్షం

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ అంచనాలకు మించి 7.8శాతం వృద్ధి నమోదు చేయడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. దేశ ప్రజల సంకల్ప బలం, సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందంటూ ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పంచుకున్నారు. ఒకవైపు ఇరాన్ యుద్ధంతో ప్రపంచమంతా సంక్షోభంలో కూరుకుపోయి, సరఫరా గొలుసు దెబ్బతిన్నప్పటికీ భారత్ మాత్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని ఆ సందేశంలో వివరించారు. మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఛాత్రోం కీ గూంజ్' క్యాంపెయిన్‌పై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కొందరి ఝూట్ కీ గూంజ్‌ను ప్రచారాన్ని ఛేదించుకుని దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతోందని వివరించారు. వోకల్ ఫర్ లోకల్, వెడ్ ఇన్ ఇండియా మంత్రాన్ని పఠించాలని యువతకు ప్రధాని పిలుపునిచ్చారు.

"భారతదేశంలో నిరాశలో కూరుకుపోయిన కొందరు వ్యక్తులు అబద్ధాలను ప్రచారం చేస్తూ, నలువైపులా నిరాశను వ్యాప్తి చేసే పనిలో పడ్డారు. వీటన్నింటినీ అధిగమించి, ఆ మాటలన్నింటినీ పటాపంచలు చేస్తూ మన దేశం 7.8% వృద్ధిని సాధించింది. మనం ఈ వృద్ధి వేగాన్ని ఇలాగే కొనసాగించాలి. మనం ఇంకా ముందుకు సాగాలి, ఇందుకోసం ఆత్మనిర్భర్ భారత్‌గా మారడం చాలా అవసరం. స్వదేశీ మంత్రమైన 'వోకల్ ఫర్ లోకల్'ను పాటించాలి. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లడం మానుకోవాలి. పెళ్లిళ్లు విదేశాల్లో చేసుకోకూడదు. 'వెడ్ ఇన్ ఇండియా' అనే మంత్రాన్ని ఆచరించాలి. అలాగే, అవసరం లేకపోతే బంగారం కూడా కొనుగోలు చేయకూడదు. మనం స్వదేశీ విధానాలపై ఎంతగా పట్టుబడితే, స్వయం సమృద్ధిపై ఎంతగా దృష్టి పెడితే మనకు స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే



నాటికి మన యువతకు 'వికసిత్ భారత్'ను అందిస్తామన్న పూర్తి నమ్మకం నాకుంది."

**'ముందు చూపు నిర్ణయాల వల్లే ఇది సాధ్యమైంది'**

మోదీ ప్రభుత్వం ముందు చూపుతో తీసుకున్న నిర్ణయాలే వల్లే 7.8 శాతం జీడీపీ వృద్ధి సాధ్యమైందని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్? షెకావత్ పేర్కొన్నారు.? "ప్రధాని మోదీ నాయకత్వంలో తీసుకున్న కీలకమైన నిర్ణయాలు వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రధాని తీసుకున్న నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను మార్చేశాయన్నారు. అలాగే, దేశాన్ని తయారీ రంగానికి కేంద్రంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన విధానపరమైన సంస్కరణలు, వ్యాపార నిర్వహణను సులభతరం చేసేలా కల్పించిన అనుకూల వాతావరణం, ఇవన్నీ భారత్ పెట్టుబడులకు ప్రధాన ఆకర్షణ కేంద్రంగా మార్చాయన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ఒత్తిడిలో ఉన్నప్పుడు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆందోళన కలిగిస్తున్న తరుణంలో భారత్ కూడా ఒత్తిడికి లోనవుతుందని చాలామంది భావించారు. కానీ వాటన్నింటి మధ్య ప్రధాని మోదీ వ్యవహరించిన తీరు కీలకమన్నారు.

**భారతీయుల కృషి, ఆకాంక్షలకు ప్రతిరూపం**

2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే భారత్ సాధించిన జీడీపీ వృద్ధిని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం ప్రశంసించారు. ఈ గణాంకాలు ఆర్థిక వ్యవస్థ బలాన్ని, స్థితిస్థాపకతను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్?లో పోస్టు పెట్టారు.? "2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారతదేశం సాధించిన 7.8శాతం వాస్తవ జీడీపీ వృద్ధి, 10.3శాతం నామమాత్ర జీడీపీ వృద్ధి, 8.2శాతం వాస్తవ జీవీఏ వృద్ధి మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని, స్థితిస్థాపకతను ప్రతిబింబిస్తున్నాయి. ఈ గణాంకాలు 140 కోట్ల మంది భారతీయుల కృషి, ఆకాంక్షలు, ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపం. వివేకవంతమైన పాలన, నిర్ణయాత్మక విధాన రూపకల్పనల మద్దతుతో భారత్? సాధిస్తున్న సంస్కరణలు నరేంద్ర మోదీజీ దార్శనిక నాయకత్వాన్ని స్పష్టంగా కనిపిస్తుంది. మరింత బలమైన, పటిష్ఠమైన భారత్? 'వికసిత్ భారత్' దిశగా స్థిరంగా పురోగమిస్తోంది" అని రాసుకొచ్చారు.

**ఎన్‌డీఏ కూటమి పనితీరుకు నిదర్శనం**

మరోవైపు, భారత జీడీపీ వృద్ధిపై శివసేన నాయకురాలు షైనా ఎన్?సి మాట్లాడారు. జీడీపీ వృద్ధి అనేది నరేంద్ర మోదీజీ నేతృత్వంలోని ఎన్?డీఏ కూటమి పనితీరుకు నిదర్శనమన్నారు. ఓ వైపు ప్రపంచవ్యాప్తంగా పెద్ద యుద్ధాలు జరుగుతున్నా, సరఫరా గొలుసులకు అంతరాయం కలుగుతున్నా, భారత్? అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని తెలిపారు. ఇది ఒక అసాధ్యమైన కార్యమని, 140 కోట్ల మంది భారతీయులు మన సమష్టి బలాన్ని ప్రశంసించారని చెప్పారు.

# విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు ఉపసంహారణ

విద్యార్థుల నిరసనలకు సంబంధించి నమోదైన కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇటీవల దిల్లీలో కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన అన్ని ఎఫ్?ఐఆర్?లను ఉపసంహరించుకుంటామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు విద్యార్థి నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లపై కీలక నిర్ణయం తీసుకున్న కొద్దిసేపటికే నడ్డా ఈ ప్రకటన చేశారు. సీజేపీ సెప్టెంబర్ 5న తలపెట్టిన నిరసనను విరమించుకోవడాన్ని కేంద్ర మంత్రి నడ్డా స్వాగతించారు. ఈ నేపథ్యంలో బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం సంప్రదింపులు జరిపిందని నడ్డా వెల్లడించారు. ఆయా రాష్ట్రాల పరిధిలో సీజేపీ నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని రాష్ట్రాలు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం యువత సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ఈ ఏడాది నీట్ పరీక్షలో అవకతవకలు, పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా, జూన్ 20న జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆందోళన చేపట్టింది. అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఈ ఉద్యమం పలు నగరాలకు విస్తరించింది. జులై 20న సీజేపీ చేపట్టిన చలో పార్లమెంటు ఆందోళనలో నిరసనకారులు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణలు జరిగాయి. చివరకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, ఇతర డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడంతో జులై 25న సీజేపీ ఈ ఆందోళనను విరమించింది. అయితే ఆ హామీలను కేంద్రం అమలు



చేయడం లేదంటూ సెప్టెంబర్ 5న మరోసారి మార్చ్‌కు సీజేపీ పిలుపునిచ్చింది.

ఎఫ్ఐఆర్‌లు కొట్టివేసిన సుప్రీంకోర్టు

కాగా, ఆందోళనల్లో పాల్గొన్న వారిపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై సుప్రీంకోర్టులో విచారణ జరగగా, విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కొట్టివేస్తూ మంగళవారం ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. అనంతరం కేంద్రం కూడా కేసుల ఉపసంహరణకు హామీ ఇచ్చింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, విద్యార్థుల ఆందోళనల అనంతరం సీజేపీ నాయకత్వానికి ఇచ్చిన మూడు హామీలను ప్రభుత్వం నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని సుప్రీంకోర్టుకు తెలిపారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై జులై 20 నుంచి 25 వరకూ దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసులో కీలక ఆదేశాలు జారీ చేసింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం చెల్లించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒక విధానాన్ని రూపొందించాలని స్పష్టం చేసింది. యువ నిరసనకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి పూర్తి న్యాయం చేయడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న అసాధారణ అధికారాల్ని వినియోగిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అయితే కేంద్రం అభ్యర్థన మేరకు జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో పాల్గొన్న తీవ్రమైన నేరచరిత్ర కలిగిన 2,873 మందిపై మాత్రం ఎఫ్?ఐఆర్?లు నమోదు చేసేందుకు దిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ప్రాణనష్టం లేదా ఆస్తి విధ్వంసంలో వారి పాత్రపై దర్యాప్తు చేయాలని సూచించింది.

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ హామీల నేపథ్యంలో సెప్టెంబర్ 5న తలపెట్టిన నిరసన మార్చ్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు సీజేపీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్? సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలిపారు. సెప్టెంబర్ 5న దిల్లీలోని ఇండియా గేట్ నుంచి దిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు శాంతియుత మార్చ్ నిర్వహించాలని గతంలో పార్టీ ప్రకటించింది. అయితే కేంద్రం ఇచ్చిన హామీ, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణకు సంబంధించిన చర్యల నేపథ్యంలో ఆ మార్చ్‌ను రద్దు చేస్తున్నట్లు సీజేపీ నాయకుడు సౌరవ్ దాస్ ప్రకటించారు. విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో సీజేపీ మొదటి నుంచీ వారి తరఫున నిలిచిందని ఆయన తెలిపారు. దిల్లీ పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లను కొనసాగించేందుకు ఆసక్తి చూపడం లేదని సుప్రీంకోర్టులో దరఖాస్తు చేసినట్లు వెల్లడించారు.

# 22 మంది ప్రాణాల్ని కాపాడిన టీ బ్రేక్
## నేపాల్ వరదల్లో కొట్టుకుపోకుండా ఆపింది ఆ 10 నిమిషాలే!

ఒక కప్పు టీ కోసం తీసుకున్న 10 నిమిషాల విరామం- 22 మంది ప్రాణాల్ని కాపాడింది. కైలాస- మానస సరోవర్ యాత్ర కోసం నేపాల్ మీదుగా టిబెట్‌కు వెళ్తున్న బెంగాల్‌లోని బర్ధమాన్‌కు చెందిన యాత్రికులు నేపాల్‌లో సంభవించిన భారీ ఫ్లాష్ ఫ్లడ్ నుంచి త్రుటిలో బయటపడ్డారు. తాము టీ కోసం ఆగకపోయి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవడానికి భయంగా ఉందని వారు చెబుతున్నారు. బర్ధమాన్‌కు చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కళ్యాణ్ తా, వ్యాపారి బిప్లవ్ హాజ్రా సహా 22 మంది బృందంగా కైలాస- మానస సరోవర్ యాత్రకు బయలుదేరారు. ఆగస్ట్ 22న వారు కాఠ్‌మాండూకు చేరుకున్నారు. చైనా వీసాల కోసం ఎదురుచూస్తూ 2 రోజులు గడిచాయి. చివరికి ఆగస్ట్ 25 రాత్రి సుమారు 8.30 గంటలకు వీసాలు వచ్చాయి. వీసాలు వచ్చిన వెంటనే బయలుదేరాలని సూచించడంతో ఆగస్ట్ 26న ఉదయం 6.30 గంటలకు కాఠ్‌మాండూ నుంచి చైనా సరిహద్దు దిశగా ప్రయాణం ప్రారంభించారు.

జస్ట్ 10 నిమిషాల టీ బ్రేక్- అంతలోనే దూసుకొచ్చిన వరద సుమారు రెండున్నర గంటలు ప్రయాణించిన తర్వాత వాహనం ఒక ప్రాంతంలో ఆగింది. అందరూ కాసేపు విశ్రాంతి తీసుకొని టీ తాగారు. ఈ చిన్న విరామమే వారి జీవితాల్ని మార్చింది. టీ తాగిన తర్వాత తిరిగి వాహనంలోకి ఎక్కేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే స్థానిక పోలీసులు వారిని అక్కడి నుంచి త్వరగా వెళ్లిపోవాలని హెచ్చరించారు. అప్పటికి యాత్రికులకు వరద పరిస్థితి తీవ్రత గురించి తెలియదు. అంతలోనే కొండల వైపు నుంచి భయంకరమైన శబ్దం వినిపించింది. పైకి చూసిన వారికి తెల్లటి మేఘంలా ఏదో కొండ దిగువకు వేగంగా దూసుకొస్తున్నట్లు కనిపించింది. అయితే అది మేఘం కాదు. నీరు, మట్టి, ఇసుక, భారీ బండరాళ్లతో కూడిన ఫ్లాష్ ఫ్లడ్.

**పోలీసుల హెచ్చరికలతో పరుగులు!**



కళ్యాణ్ తా చెప్పిన వివరాల ప్రకారం- పోలీసులు చేతుల్లో కర్రలతో పరిగెత్తుతూ- 'పరిగెత్తండి.. ఇక్కడి నుంచి వెళ్లిపోండి.' అంటూ వారిని హెచ్చరించారు. ఆ ప్రాంతం గురించి పెద్దగా అవగాహన లేకపోయినా 22 మంది బెంగాలీ యాత్రికులు స్థానికులతో కలిసి ఎత్తైన ప్రాంతం వైపు పరుగులు తీశారు. దాదాపు 200 మీటర్ల ఎత్తుతో ఉన్న ఒక కొండ ప్రాంతంపైకి భయంభయంగానే చేరుకున్నారు. తమకు స్థానికులతో పోలిస్తే అంతగా శారీరక సామర్థ్యాలు లేకపోయినా, ఆ సమయంలో ప్రాణాలు కాపాడుకోవాలనే భయమే తమను పరిగెత్తించిందని చెప్పారు. ఎత్తయిన ప్రాంతానికి చేరుకున్న తర్వాత కూడా వారి భయం తగ్గలేదు. తమ కళ్లముందే వాహనాలు, చెట్లు, ఇళ్లు, పశువులు, మనుషులు వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న దృశ్యాల్ని చూశారు. కళ్యాణ్ ఆ అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ తాము నిజంగానే బతికే ఉన్నామా అనే నమ్మకం కూడా కొంత సేపటి వరకు కలగలేదని చెప్పారు. మరణాన్ని అంత దగ్గరగా ఎప్పుడూ చూడలేదని, సమయంలో మనిషి ప్రాణం కోసం చేసే పోరాటాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు తెలిపారు. ఒక తల్లి తన బిడ్డ కోసం ఆందోళనగా వెతుకుతున్న దృశ్యం, ఒకరినొకరు పట్టుకొని ప్రాణాలు కాపాడుకునేందుకు స్థానికులు ప్రయత్నించడం వంటి ఘటనల్ని చూసినట్లు వెల్లడించారు.

ఇక ఈ ఘటన తర్వాత బిప్లవ్ హాజ్రా కూడా పదేపదే ఆ పది నిమిషాల టీ బ్రేక్ గురించే ఆలోచిస్తున్నారు. వాహనంలో కూర్చున్న సమయంలో తను టాయిలెట్‌కు వెళ్లాల్సి ఉందని చెప్పానని, అప్పుడు కళ్యాణ్ దా అందరం టీ తాగుదామని సూచించారని బిప్లవ్ తెలిపారు. దీంతో సుమారు 10 నిమిషాలు అక్కడే ఆగిపోయామని చెప్పారు. తాము కాస్త ముందే బయలుదేరి ఉంటే, లేదా టీ బ్రేక్ కోసం ఆగకపోయి ఉంటే ఫ్లాష్ ఫ్లడ్ వచ్చిన సమయంలో అదే బ్రిడ్జిపై ఉండేవారమని ఆయన చెప్పారు. తాము ఆగిన ప్రదేశం నుంచి ఆ బ్రిడ్జి కేవలం 6 లేదా 7 నిమిషాల దూరంలోనే ఉందని వివరించారు. తాము ముందుకు వెళ్లి ఉంటే రెండు బ్రిడ్జిల మధ్య చిక్కుకుపోయేవారమని, వెనుక బ్రిడ్జి కూలిపోగా, ముందున్న మరో బ్రిడ్జి కూడా వరదలో కొట్టుకుపోయిందని చెప్పుకొచ్చారు. చివరికి పరిస్థితులు కుదుటపడ్డాక ఆ 22 మంది యాత్రికులు యాత్ర రద్దు చేసుకొని తిరుగుపయనం అయ్యారు.

**సామూహిక ఖననాలు**

నేపాల్‌లో వరదల వినాశనం సృష్టించిన విషాదం రోజురోజుకూ మరింత భయానకంగా మారుతోంది. విపత్తు సంభవించి వారం రోజులు గడుస్తున్నా బురద, శిథిలాల కింద నుంచి మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. దీంతో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలోని ప్రధాన ఆస్పత్రులు, శ్మశానాలు మృతదేహాలతో నిండిపోయాయి. కొత్తగా వెలికితీస్తున్న డెడ్‌బాడీలను భద్రపరచడానికి స్థలం లేకపోవడంతో నేపాల్ ప్రభుత్వం కాఠ్‌మాండూలో సామూహిక ఖననాలు ప్రారంభించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మృతదేహాలు కుళ్లిపోయి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

## సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

**హైదారాబాద్/అమరావతి** నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లైంది. ఈ మేరకు సుప్రీంకోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడించింది. ఢిల్లీ, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కోర్టు కొట్టివేసింది. ఢిల్లీ పరిధిలో జంతర్‌మంతర్ వద్ద జులై 20-25 వరకు జరిగిన నిరసనలపై 13 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే, ఈ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఎలాంటి కేసులు ఉండవు. కానీ, ఈ నిర్ణయం అందరికీ వర్తించదు. గతంలో క్రిమినల్ కేసులు ఉన్నవారిపై మాత్రం ఎఫ్ఐఆర్‌లు కొనసాగుతాయి. అలా, 2,873 మందిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు మాత్రం కొనసాగుతాయని కోర్టు తెలిపింది. నీట్ ఆందోళనలపై అన్ని రాష్ట్రాల్లో నమోదైన కేసులు కొట్టివేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. మరోవైపు నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించే విషయంపై కూడా సుప్రీంకోర్టు స్పందించింది. పరిహారం అందించేందుకు మూడు నెలల్లో విధి విధానాలు రూపొందిస్తామని ప్రభుత్వం తెలిపినట్లు కోర్టు వ్యాఖ్యానించింది.

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు..

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో కీలక మార్పులు రానున్నాయి. పథకాలను ఎలా వర్గీకరించాలి? వాటి వివరాలను ఎలా చూపించాలి? అన్నదానిపై పెన్షన్ నియంత్రణ సంస్థ పీఎఫ్ఆర్‌డీఏ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్‌లో ఈ మార్పులను ప్రకటించింది. 2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఇకపై ఎన్‌పీఎస్ పథకాలను ఈక్విటీ పెట్టుబడి ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజిస్తారు. 80-100 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ-ఏ'లో ఉంటాయి. వీటిని అత్యంత అధిక రిస్క్ ఉన్న 'అగ్రెసివ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 60-80 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-బి'లో ఉంటాయి. వీటిని అధిక రిస్క్ ఉన్న 'హై గ్రోత్' పథకాలుగా పేర్కొంటారు. 35-60 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-సి'లో ఉంటాయి. ఇవి మధ్యస్థ రిస్క్ ఉన్న 'బ్యాలెన్స్‌డ్ గ్రోత్' పథకాలు. 10-35 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-డి'లో ఉంటాయి. వీటిని 'కన్జర్వేటివ్'గా పరిగణిస్తారు. 0-10 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-ఈ'లో ఉంటాయి. ఇవి రుణ ఆధారిత పథకాలుగా ఉంటాయి. ఒక పథకం ఈక్విటీ పరిమితి రెండు కేటగిరీల్లోకి వచ్చేలా ఉండకూడదు. దీంతో పెట్టుబడిదారులు తమ రిస్క్ స్థాయికి తగ్గ పథకాన్ని సులభంగా ఎంచుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో చేరే వారికి మరో మార్పు కూడా ఉంది. అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రజెన్స్' (పీఓపీ) ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచే వారికి ఒక్కో పీఆర్ఏఎన్‌పై రూ.200 వన్‌టైమ్ ఛార్జీ వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ప్రతి త్రైమాసికానికి రూ.50 చొప్పున యూనిట్లను రద్దు చేసి వసూలు చేస్తారు. పథకాలను ఎంచుకునే ముందు పెట్టుబడిదారులకు మరింత సమాచారం అందేలా పీఎఫ్ఆర్‌డీఏ చర్యలు తీసుకుంది. పథకం పేరు, పెన్షన్ ఫండ్, ప్రారంభ తేదీ, రాబడులు, బెంచ్‌మార్క్, ఛార్జీలు, రిస్క్‌మీటర్, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాలు ఒకే విధానంలో కనిపించనున్నాయి. అయితే ప్రభుత్వ రంగ ఎన్‌పీఎస్ ఖాతాలకు కొత్త వర్గీకరణ వర్తించదు.

## 'ఎకానమీపై మోదీ చేస్తున్న ప్రచారం 'లైట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉంది'

ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ అంచనాలకు మించి 7.8శాతం వృద్ధి నమోదు చేయడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. జీడీపీ వృద్ధిని ప్రశంసిస్తూ ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను షేర్ చేయడంపై దుయ్యబట్టారు. మోదీ ఆర్థిక వ్యవస్థపై చేస్తున్న ప్రచారం కేవలం 'లైట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉందని విమర్శించారు. సామాన్య ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరిందని, 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారని అన్నారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "దేశం జీడీపీ వృద్ధి సంబరాలు జరుపుకుంటోందని నరేంద్ర మోదీ చెబుతున్నారు. ఆ సౌకర్యం ఆయనకు ఉండొచ్చు. కానీ సామాన్యుడికి లేదు! సామాన్య ప్రజలు 3'ఖ'ల భారంతో ఉన్నారు. దానికి మోదీయే బాధ్యులు!. ఆ 3'ఖ'లు ఏంటంటే అనూహ్యమైన నిరుద్యోగం, భరించలేని ధరల పెరుగుదల, అదుపులేని అసమానత!. దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారు. 2026 జులై నాటికి 15- 29 ఏళ్ల మధ్య వయసున్న ప్రతి ఆరుగురు యువ భారతీయులలో ఒకరు నిరుద్యోగిగా ఉన్నారు. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ వాగ్దానం భగ్నమైంది. రిటైల్ ద్రవ్యోల్బణం 19 నెలల గరిష్ఠానికి చేరింది. చక్కెర, ఉల్లి, టమాటా, పప్పుధాన్యాలు, వంట నూనె, బియ్యం, పాలు, ఇలా ప్రతి నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ ధరలు సాధారణ ప్రజలకు అందుబాటులోకి లేకుండా పోతున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఎలాగోలా బతకడానికి పోరాడుతున్నాయి. పేదలు ఆశ వదులుకున్నారు" అలాగే సంపద అసమానతలపై కూడా మోదీ ప్రభుత్వాన్ని మల్లికార్జున ఖర్గే ఎండగట్టారు. బ్రిటిష్ పాలన కంటే దారుణమైన అసమానత దేశంలో ప్రస్తుతం ఉందన్నారు. దేశ మొత్తం సంపదలో 40శాతం ఒక శాతం మంది చేతిలోనే ఉందని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో పేదల నుంచి ధనికులకు సంపద బదిలీని మోదీ ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. విచ్చలవిడి ఆశ్రిత పెట్టుబడిదారీ విధానమే కేంద్ర సర్కార్ ఏకైక ఆర్థిక విధానమని ఎద్దేవా చేశారు.

**'తన సన్నిహిత మిత్రుడికి ట్రావెల్ ఏజెంట్‌గా మోదీ'**

"2014 నుంచి మోదీ ప్రభుత్వం రూ. 16 లక్షల కోట్లకు పైగా కార్పొరేట్ రుణాలను మాఫీ చేసింది. అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయమేమిటంటే రూ. 22,006 కోట్ల అంగీకరించిన క్లెయిమ్‌లకు గానూ రుణదాతలు కేవలం రూ. 6.5 కోట్లను మాత్రమే తిరిగి పొందగలిగారు. అంటే 99.97శాతం రుణాన్ని వదులుకోవాల్సి వచ్చింది. భారత ప్రధాని మోదీ తన సన్నిహిత మిత్రుడికి వ్యక్తిగత ట్రావెల్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని దేశం చూసింది!. భారతీయులు బంగారం కొనొద్దని, విదేశాలకు వెళ్లొద్దని మోదీ పదేపదే చేసే ఉపన్యాసాలు క్షేత్రస్థాయి వాస్తవాలను తెలియజేస్తున్నాయి. వాస్తవం ఏమిటంటే ప్రజలకు అబద్ధాలు చెప్పే మీ సామర్థ్యం తప్ప మరేమీ మారలేదు!" అని ఖర్గే పేర్కొన్నారు.

**ఆ జీడీపీ వృద్ధి గణాంకాల గారడీయే : జైరాం రమేశ్**

మరోవైపు, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీడీపీ గణాంకాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వృద్ధిని 'గణాంకాల గారడీ'గా అభివర్ణించారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం చాలా తక్కువ ఫలితాలను సాధించిందని, కానీ మోదీ ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ఫేక్ ఇన్ ఇండియా' పథకం మాత్రం నిరాటంకంగా కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం దేశ దయనీయమైన ఆర్థిక వాస్తవికతను దాచిపెడుతూ జీడీపీ గణాంకాలను తారుమారు చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "నామమాత్రపు, వాస్తవ జీడీపీల మధ్య వ్యత్యాసం ద్రవ్యోల్బణాన్ని సూచిస్తుంది. అయితే ఆ తేడాను కేవలం 2.3శాతం మాత్రంగా ప్రభుత్వం చూపించింది. కానీ ఈ త్రైమాసికంలో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం 9 శాతానికి పైగా ఉంది. ఇది స్పష్టమైన వ్యత్యాసం. ఈ ఏడాది జీడీపీని లెక్కించే పద్ధతిని రెండుసార్లు సవరించిన మోదీ ప్రభుత్వమే ఈ వ్యత్యాసాన్ని సృష్టించింది. మోదీ ప్రభుత్వం నిజాయితీతో కూడిన గణాంకాలను ఇచ్చి ఉంటే వాస్తవ వృద్ధి రేటు చాలా తక్కువగా ఉండేది. ఈ విషయాన్ని మోదీ ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారుతో సహా చాలా మంది గతంలోనే చెప్పారు"

**'ప్రజలకు మోదీ ప్రభుత్వం వారానికో షాక్ ఇస్తోంది'**

పెరుగుతున్న ధరల రూపంలో దేశానికి మోదీ ప్రభుత్వం భారీ షాక్ ఇస్తోందని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. అహంకారపూరిత మోదీ ప్రభుత్వం గణాంకాల గారడీ ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే పనిలో నిమగ్నమై ఉందని విమర్శించారు. "మోదీ సర్కార్ ప్రతి వారం దేశానికి పెరుగుతున్న ధరల రూపంలో ఒక కొత్త, భారీ షాక్‌ను ఇస్తోంది. ద్రవ్యోల్బణం కేవలం వంటగదికే పరిమితం కాలేదు. ఇంటి నిర్మాణం నుంచి విద్యుత్ పరికరాల వరకు ప్రతి అంశంలోనూ పెరుగుతున్న ఖర్చుల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు" అని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు.

## బిజినెస్

### భారత్‌లో టెస్లా 20 సూపర్ ఛార్జర్లు ఏర్పాటు



ప్రపంచ ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లా భారత మార్కెట్‌లో తన మౌలిక వసతులను వేగంగా ఏర్పాటు చేస్తోంది. ప్రధాన నగరాల్లో ఛార్జింగ్ నెట్‌వర్క్‌తో పాటు విక్రయానంతర సేవలను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 20 'సూపర్ ఛార్జర్ల'ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పింది. అలాగే గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కొత్తగా 'టెస్లా-అప్రూవ్డ్ బాడీ షాప్' (టీఏబీ), సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించినట్లు కంపెనీ వెల్లడించింది. అహ్మదాబాద్‌లో కొత్త సదుపాయం ప్రారంభోత్సవం సందర్భంగా టెస్లా ఇండియా కంట్రీ హెడ్ శరద్ అగర్వాల్ మాట్లాడుతూ.. అహ్మదాబాద్‌లో తెరిచిన ఈ సెంటర్ భారత్‌లో కంపెనీకి చెందిన 7వ బాడీ షాప్, సర్వీస్ సెంటర్ అని స్పష్టం చేశారు. ఇప్పటికే గురుగ్రామ్, ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, పుణె, ముంబై నగరాల్లో టెస్లా తమ సర్వీస్ సెంటర్లను నిర్వహిస్తోంది. గుజరాత్ పరిధిలోని వినియోగదారులకు ఒరిజినల్ స్పేర్ పార్ట్స్, శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులతో బాడీ రిపేర్, కొలిజన్ రిపేర్ సేవలను ఇది అందిస్తుంది. టెస్లా వాహనాలకు షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ అవసరం చాలా స్వల్పమని అగర్వాల్ పేర్కొన్నారు. సింహభాగం సాంకేతిక సమస్యలను 'రిమోట్ డయాగ్నోసిస్' (సాఫ్ట్‌వేర్ ఆధారిత తనిఖీ) ద్వారానే పరిష్కరించవచ్చని, 24/7 సర్వీస్ అసిస్టెన్స్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో మోడల్ రెండు వేరియంట్లను అందుబాటులో ఉంచారు. మోడల్ వై ఆర్‌డబ్ల్యూడీ ధర సుమారుగా రూ.51.89 లక్షలు, మోడల్ వైఎల్ రూ.61.99 లక్షలుగా ఉంది.

# ఇక ఫీచర్ ఫోన్లలోనూ యూపీఐ..

## ఇంటర్నెట్‌తో పనిలేకుండా 'ఫోన్‌పే యూపీఐ 123పే' సేవలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** ఇకపై ఫీచర్ ఫోన్ వినియోగదారులూ యూపీఐని వినియోగించుకోనున్నారు. ఫిన్‌టెక్ దిగ్గజం ఫోన్‌పే.. సోమవారం 'ఫోన్‌పే యూపీఐ 123పే' సేవలను ప్రారంభించింది. దీనివల్ల ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకుండానే ఫీచర్ ఫోన్ యూజర్లకూ యూపీఐ లావాదేవీలను జరిపే వెసులుబాటు దక్కింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 20 కోట్లకుపైగానే ఫీచర్ ఫోన్ వినియోగదారులున్నట్టు అంచనా. అయితే స్మార్ట్‌ఫోన్ యూజర్లకున్నట్టు ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడంతో వీరంతా యూపీఐ లావాదేవీలకు దూరమవుతున్నారు. కానీ ఇప్పుడు వీరు కూడా ఫోన్‌పే యూపీఐ 123పే ద్వారా ఇకపై యూపీఐ లావాదేవీలను జరుపుకోవచ్చని, ఈ తరహా సౌకర్యాన్ని అందిస్తున్న తొలి ప్రముఖ థర్డ్-పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్ (టీపీఏపీ) తామేనని ఫోన్‌పే ఈ సందర్భంగా స్పష్టం చేసింది.పేమెంట్ సిస్టమ్స్ ఎంచుకోవడం

**అన్ని ఫోన్లలో కాదు..**

ఇప్పటికైతే నోకియా, హెచ్ఎండీ, లావా ఇంటర్నేషనల్, ఐటెల్ మొబైల్ కంపెనీలకు చెందిన ఫీచర్ ఫోన్ వినియోగదారులు మాత్రమే ఫోన్‌పే యూపీఐ 123పే సేవల్ని పొందవచ్చు. ఈ ఫోన్లలో ప్రీ-బండిల్డ్‌గా ఫోన్‌పే యూపీఐ 123పే ఉంటుంది. అయితే మరిన్ని మొబైల్ ఫోన్లలోనూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకొనేలా ప్రయత్నిస్తున్నామని ఫోన్‌పే చెప్తున్నది. ఇదిలావుంటే కొత్తగా ఫీచర్ ఫోన్ కొనేవారికే ఈ ఫోన్‌పే యూపీఐ 123పే సేవలు అందుబాటులో ఉంటాయా? లేదా ఇప్పటికే సదరు ఫోన్లను వాడుతున్నవారూ పొందవచ్చా? అన్నదానిపై మాత్రం స్పష్టత లేదు. ఇక ఇదో ఎస్ఎంఎస్ ఆధారిత యూపీఐ నిర్మాణం. 2జీ కనెక్టివిటీ పరిమితంగా ఉన్న ప్రాంతాల్లోనూ పనిచేస్తుంది. మొబైల్ నెంబర్ లేదా యూపీఐ ఐడీ, క్యూఆర్ కోడ్‌లను వినియోగించి పర్సన్-టు-పర్సన్, పర్సన్-టు-మర్చంట్ పేమెంట్స్‌నూ చేసుకోవచ్చు. బ్యాంక్ ఖాతాలో ఎంత నగదు ఉన్నది? గతంలో జరిపిన లావాదేవీల చరిత్రనూ చూసుకోవచ్చు. ముున్ముందు బిల్ పేమెంట్స్, మొబైల్ రీచార్జ్‌స్, ఆధార్ ఆధారిత ఆన్‌బోర్డింగ్ సేవల్నీ తెస్తామని ఫోన్‌పే చెప్తున్నది.ఇంటర్నెట్ సేవలు ఎంచుకోవడం




**ఏఐ ఆధారిత హెల్ప్‌లైన్**

ఫీచర్ ఫోన్ వినియోగదారులు ఫోన్‌పే యూపీఐ 123పే సేవల్ని వినియోగించుకోవడానికి వీలుగా ఫోన్‌పే ఓ వాయిస్-ఫస్ట్, ఏఐ ఆధారిత హెల్ప్‌లైన్‌నూ ప్రారంభించింది. స్టెప్-బై-స్టెప్ గైడెన్స్ తీసుకోవచ్చని, యూపీఐ సంబంధిత ప్రశ్నలకూ సమాధానాలు పొందవచ్చని, ఇంగ్లిష్‌తోపాటు 12 స్థానిక భాషల్లోనూ యూజర్లు సాయం అందుకోవచ్చని ఫోన్‌పే తెలిపింది. కాగా, ఈ ఏడాది జూలైనాటికి ఫోన్‌పే వినియోగదారులు 71.5 కోట్లపైనే. అలాగే 5 కోట్లకుపైగా వ్యాపార భాగస్వాములున్నారని ఫోన్‌పే చెప్తున్నది.

**నమోదు ఇలా..**

ఫీచర్ ఫోన్‌పైనున్న ప్రీ-ఇన్‌స్టాల్డ్ ఫోన్‌పే యాప్‌ను తెరువాలి.
ఆ తర్వాత అక్కడున్న సమాచారాన్ని చదివి, నిబంధనలు-షరతుల్ని అంగీకరిస్తే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.
అనంతరం కనిపించే జాబితాలో వినియోగదారులు తమకు ఖాతా ఉన్న బ్యాంక్‌ను ఎంచుకోవాలి.
తమ డెబిట్ కార్డ్ చివరి ఆరు అంకెలు, కార్డ్ గడువు (ఎక్స్‌పైరీ) తేదీని కూడా ఎంటర్ చేయాలి.
ఆపై యూపీఐ పిన్ నెంబర్‌ను సెట్ చేసుకోవాలి.
ఒక్కసారి యూపీఐ పిన్ నెంబర్ సెట్ అయితే.. యూపీఐ ఐడీ యాక్టివ్ అవుతుంది. యూజర్లు ఫోన్‌పే యూపీఐ 123పే ద్వారా చెల్లింపులను చేసుకోవచ్చు.
చెల్లింపులు ఇలా..

**ఫోన్‌పే యాప్‌ను తెరువాలి.**

'పే టు మొబైల్ నెంబర్ లేదా పే టు యూపీఐ ఐడీని ఎంచుకోవాలి.
ఎవరికైతే నగదు పంపాలో వారి మొబైల్ నెంబర్ లేదా యూపీఐ ఐడీని ఎంటర్ చేయాలి.
చెల్లింపులకు సంబంధించి అన్ని వివరాలను చెక్ చేసుకోవాలి.
ఎంతైతే నగదు పంపాలో ఆ మొత్తాన్ని ఎంటర్ చేసి యూపీఐ పిన్ ఎంటర్ చేయాలి. ఆపై 'ఓకే' నొక్కాలి.
తర్వాత వచ్చే స్క్రీన్‌లో పేమెంట్ విజయవంతంగా పూర్తయ్యిందో లేదో తెలియపరుస్తుంది.
కెమెరా సదుపాయం ఉన్న ఫీచర్ ఫోన్ యూజర్లు స్కాన్ అండ్ పే ఆప్షన్‌నూ ఎంచుకొని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపులు జరుపవచ్చు.

# రక్షణ రంగంలో స్వేచ్ఛగా ఎఫ్‌డీఐలు?.. పరిశీలిస్తున్న మోదీ సర్కార్

న్యూఢిల్లీ, ఆగస్టు 31: విదేశీ మదుపర్లను మరింతగా ఆకట్టుకోవడానికి రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు సంబంధించి ఉన్న నిబంధనలను ఇంకా సరళతరం చేయాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ యోచిస్తున్నది. ఈ మేరకు ఓ ఉన్నతాధికారి సోమవారం తెలిపారు. ఈ అంశంపై పారిశ్రామిక, అంతర్గత వాణిజ్యంపై ప్రోత్సాహక శాఖ భాగస్వాములతో సంప్రదింపులు కూడా జరుపుతున్నదని సమాచారం. ఈ క్రమంలోనే 'కొన్ని నిబంధనలను సడలించే విషయాన్ని పరిశీలిస్తున్నారు' అని సదరు ఉన్నతాధికారి పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ రక్షణ రంగంలోకి ఆటోమేటిక్ మార్గం ద్వారా 74 శాతం వరకే ఎఫ్‌డీఐకి అనుమతి ఉన్నది.ప్రభుత్వ ఏజెన్సీలను సంప్రదించండి ఇంతకుమించి పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తప్పనిసరి. అలాగే ఇప్పుడున్న విధానం ప్రకారం రక్షణ రంగంలో పెట్టుబడులు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ భద్రతాపరమైన అంగీకారానికి, రక్షణ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు లోబడి ఉంటాయి. కాగా, 2000 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు దేశంలోని రక్షణ పరిశ్రమల్లో ఎఫ్‌డీఐ 32.29 మిలియన్ డాలర్లుగా ఉన్నది. ఇక 2025-26లో రక్షణ ఎగుమతుల్లో ప్రైవేట్ రంగం వాటా రూ.17,353 కోట్లు లేదా 45.16 శాతంగా ఉన్నది. ప్రభుత్వ రక్షణ రంగ సంస్థల వాటా రూ.21,071 కోట్లు లేదా 54.84 శాతంగా ఉన్నది. అయితే దేశ రక్షణ రంగం అత్యంత సున్నితమైనది కావడంతో ఇందులో ఎఫ్‌డీఐలకు పెద్దపీట వేయడం అంతగా శ్రేయస్కరం కాదన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయిప్పుడు. ప్రభుత్వ సహకారంతో స్థానిక సంస్థలకే భాగస్వామ్యం ఇవ్వాలని సూచిస్తున్నారు




# బుమ్రా వచ్చేశాడు..
# మళ్లీ భారత టీ20 స్క్వాడ్‌లో ఆ ముగ్గురు..!

భారత క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఇటీవల గాయాలతో భారత జట్టుకు దూరమైన జస్ప్రీత్ బుమ్రా టీ20 స్క్వాడ్‌లోకి వచ్చేశాడు. అఫ్గనిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌కు ప్రకటించిన స్క్వాడ్‌లో బుమ్రా ఎంపికయ్యాడు. అలానే.. శ్రీలంక పర్యటనకు దూరమైన ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రానా, వాషింగ్టన్ సుందర్‌లు ఫిట్‌నెస్ సాధించారు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మెరుగుపడిన ఈ ముగ్గురినీ స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు. స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో టీ20 సిరీస్ కోసం భారత సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాతో పాటు శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు దూరమైన తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రానా, వాషింగ్టన్ సుందర్‌లను సైతం ఎంపిక చేశారు. మంగళవారం సెలెక్టర్లు శ్రేయాస్ అయ్యర్(రాష్ట్రీవఝం ×ఎవతీ) సారథిగా, తిలక్ వర్మ డిప్యూటీగా 15మందితో కూడిన బృందాన్ని ప్రకటించారు. జింబాబ్వే పర్యటనలో ఓపెనర్‌గా మెరిసిన వైభవ్ సూర్యవంశీ స్థానం నిలబెట్టుకోగా.. వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్‌ను తీసుకున్నారు. ఎందుకనో తెలీదుగానీ.. మాజీ కెప్టెన్లు హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్‌లను పక్కన పెట్టేశారు సెలెక్టర్లు.రాశీబ్ష్ట్రాంఋఅం c ణఋంజూశీత్మీ

**ఫిట్‌గా ఉంటేనే..**

కాబూలీలతో సిరీస్ కోసం సెలెక్టర్లు ప్రధాన బౌలర్లను చోటివ్వగా.. గాయం నుంచి కోలుకున్న మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్క్వాడ్‌లోకి వచ్చాడు. రవి బిష్ణోయ్ రెండో స్పిన్నర్‌గా స్థానం సాధించాడు. బుమ్రా, హర్షిత్, వరుణ్ రాకతో ఇంగ్లండ్ గడ్డపై ఆడిన ప్రసిధ్ కృష్ణ, సూర్యాన్ష్ షెడ్గే, ప్రిన్స్ యాదవ్‌కు అఫ్గన్ సిరీస్‌లో చోటు దక్కలేదు. అయితే.. స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్న బుమ్రా, నితీశ్, సుందర్, రాణాలు ఈ సిరీస్‌లో ఆడతారా? లేదా?అనేది ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 13వ తేదీ నుంచి భారత్, అఫ్గనిస్థాన్ మధ్య మూడు టీ20ల సిరీస్ మొదలవ్వనుంది. సెప్టెంబర్ 15న రెండో మ్యాచ్,17వ తేదీన మూడో టీ20 జరుగనున్నాయి.




**భారత టీ20 స్క్వాడ్ :** శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివం దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుంద్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా.

## ఆర్సీబీ కెప్టెన్‌పై ఇషాన్ పైచేయి..
## దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్‌జోన్..!



దేశవాళీ సీజన్‌లో మొదటిదైన దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్(ఝఝర్ ్గశీఅవ) ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆల్‌రౌండ్ షోతో దుమ్మురేపిన ఈస్ట్ డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్(జవతీఝశ్రీ ్గశీఅవ)పై గెలుపొందింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(40), కెప్టెన్ ఇషాన్ కిషన్(39)ల బ్యాటింగ్ మెరుపులకు.. పేసర్ ముకేశ్ కుమార్(3-56, 4-44) విజృంభణ తోడవ్వగా సెమీ ఫైనల్లో సౌత్ చతికిలపడింది. ఐపీఎల్‌లో డబుల్ ట్రోఫీలతో మెరిసిన రజత్ పాటిదార్‌పై ఇషాన్ బృందం పైచేయి సాధించగా 4 వికెట్ల తేడాతో విజయం సాధించిన ఈస్ట్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఐపీఎల్‌లో వరసగా రెండుసార్లు ఆర్సీబీని విజేతగా నిలిపిన రజత్ పాటిదారి దేశవాళీలో మాత్రం విఫలమయ్యాడు. నిరుడు దులీప్ ట్రోఫీలో సౌత్ జోన్‌కు ట్రోఫీ కట్టబెట్టిన అతడు.. ఈసారి అదే ఫలితాన్ని సాధించలేకపోయాడు. దాంతో.. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన సెమీఫైనల్లో ఈస్ట్ జోన్ జట్టు సౌత్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించింది. రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి నిర్దేశించిన స్వల్ప ఛేదనలో ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(24), వైభవ్ సూర్యవంశీ(40)లు శుభారంభమివ్వగా మిడిలార్డర్ బ్యాటర్లు రాణించారు. గాయంతో రెండో రోజు ఆటకు దూరమైన కెప్టెన్ ఇషాన్ కిషన్(39) దంచేశాడు. దాంతో.. సౌత్‌పై 4 వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది ఈస్ట్.

**దూబే తిప్పేసినా..**

తొలి ఇన్నింగ్స్‌లో రింకూ సింగ్(60) రాణించినా 266 పరుగులకే సౌత్ జోన్ ఆలౌటైంది. అనంతరం హర్ష్ దూబే(4-66), ఆర్యన్ పాండే(3-43)ల విజృంభణతో ఈస్ట్ జోన్ సైతం అన్నే పరుగులకు కుప్పకూలింది. కానీ, రెండో ఇన్నింగ్స్‌లోనైనా భారీ స్కోర్ కొట్టాలనుకున్న సౌత్‌ను అభిజిత్ సర్కార్(3-38), ముకేశ్ కుమార్(3-56)లు దెబ్బకొట్టారు. దాంతో, రజత్ పటిదార్ సేన 158 రన్స్‌కే పరిమితమైంది. అనంతరం 159 పరుగుల స్వల్ప ఛేదనలో ఈస్ట్ ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(24), వైభవ్ సూర్యవంశీ(40)లు ధనాధన్ ఆడారు. మళ్లీ దూబే(4-53) తిప్పేసినా.. ఇషాన్ కిషన్(39) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దూబే నాలుగు వికెట్లు తీసినా.. షమీ విన్నింగ్ షాట్ కొట్టగా.. డిఫెండింగ్ ఛాంపియన్ ఇంటిదారి పట్టింది.

## స్పోర్ట్స్

### టెన్నిస్ కోర్టే ఫ్యాషన్ వేదిక..
### ఈసారి బాస్కెట్ బాల్ దిగ్గజంలా ఒసాక..!



మహిళల టెన్నిస్ స్టార్ నవోమి ఒసాకా ఆటతోనే కాదు తన ఫ్యాషన్ సెన్స్‌తోనూ వార్తల్లో నిలుస్తుంటుంది. గ్రాండ్‌స్లామ్ టోర్నీ అనగానే ఈ ఫ్యాషనిస్టా.. ట్రెండీ దుస్తుల్లో, ఏదైనా థీమ్‌తో కూడిన డ్రెస్‌లో వైరలవుతుంటుంది. ప్రతిసారి సరికొత్త డ్రెస్సింగ్స్‌ను ఎంచుకుంటూ తొలిరౌండ్ కోసం కోర్టులో అడుగుపెడుతుందీ జపాన్ ప్లేయర్. ఇప్పుడు యూఎస్ ఓపెన్‌లో ఆరంభ పోరు కోసం ఒసాకా బాస్కెట్ బాల్ దిగ్గజం లుక్‌తో వచ్చి అందర్నీ అబ్బురపరిచింది. టెన్నిస్ కోర్టునే ఫ్యాషన్ వేదికగా మార్చేసే నవోమి ఒసాకా మరోసారి వైరలవుతోంది. యూఎస్ ఓపెన్ 2026 మహిళల సింగిల్స్ తొలి మ్యాచ్ కోసం ఈ జపాన్ ప్లేయర్ వెరైటీగా.. బాస్కెట్ బాల్ దిగ్గజం గెటప్‌లో వచ్చింది. అమెరికా మాజీ ఆటగాడు, ఎన్‌బీఏ గ్రేట్ అలెన్ ఐవెర్సన్ (ూశ్రీశ్రీవఅ ×జవతీంశీఅ) మాదిరిగా కోర్టులో అడుగుపెట్టింది ఒసాక. పొడవాటి తెల్లని స్కర్ట్ దానిపై వదులుగా ఉన్న హుడీ ధరించింది. కోర్టులోకి వచ్చాక.. ఆ డ్రెస్ తీసేసిన ఒసాక.. ఐవెర్సన్ లుక్‌తో అందర్నీ ఆశ్చర్యపరిచింది. అచ్చం అమెరికా వెటరన్ స్టయిల్లో తన జట్టును కార్న్ రోస్ తరహాలో డిజైన్ చేయించుకుంది తను. తద్వారా అతడిపై తనుకున్న అభిమానాన్ని చాటుకుంది ఒసాక. అంతేకాదు కోర్టులోకి రావడానికి ముందు ఐవెర్సన్ ఫొటో ముద్రించి ఉన్న షర్ట్‌ను ధరించిందీ టెన్నిస్ స్టార్. తన కొత్త స్టయిల్ గురించి అడుగగా.. 'నాకు ఐవెర్సన్ అంటే ఇష్టం. అతడు కూడా నాలానే రకరకాల ఫ్యాషన్‌లు ప్రయత్నించేవాడు. అతడు తన ఆటతో, స్టయిల్‌తో ఎన్‌బీయే ఆటగాళ్ల డ్రెస్‌ను మార్చేశాడు. స్పోర్ట్స్‌లో క్రీడాకారుల దుస్తులపై సుదీర్ఘ చర్చలు జరుగుతాయని తెలుసు. మన గురించి మనం ఫ్యాషన్ ద్వారా తెలియజేయవచ్చు. ఆ విషయంలో ఐవెర్సన్ అద్భుతం' అని ఒసాక పేర్కొంది. తన స్టయిల్‌తో కోర్టులోకి వచ్చిన జపాన్ ప్లేయర్‌ను ఐవెర్సన్ అభినందించాడు. 'వావ్.. ఎంతగొప్ప గౌరవం. నువ్వు నాకు బిగ్ ఫ్యాన్. నిన్ను చూసేందుకు ఎదురుచూస్తున్నా' అతడు మెసేజ్ పంపాడు. ఇక తొలి రౌండ్‌లో జఖరోవాపై గెలుపొందిన ఒసాక రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది.

**నిరుడు లబుబ్ డాల్స్‌తో..**

గత ఏడాది కూడా యూఎస్ ఓపెన్‌లో 'లబుబ్ డాల్స్'తో నెట్టింట వైరలైన ఒసాక.. ఆస్ట్రేలియన్ ఓపెన్ (ూబర్‌తీఝశ్రీఋఅ ాజూవఅ)లో కూడా వినూత్న వేషధారణతో తళుక్కుమంది. తొలి రౌండ్ మ్యాచ్ కోసం కోర్టుకు ఆమె ఆక్వా బ్లూ(సముద్రపు నీలిరంగు)టై డై ట్రాక్‌సూట్ జాకెట్.. దానికి మ్యాచింగ్‌గా తెల్లని పలోజాను పోలిన వెడల్పాటి ప్యాంట్ ధరించింది. ముఖాన్ని కవర్ దాదాపుగా కవర్ చేసేలా తెల్లని మేలి ముసుగు, తెల్లని టోపీ, చేతిలో తెలుపు రంగు గొడుకు పట్టుకొని ఫ్యాషన్ సుందరిలా నడుస్తూ కోర్టులోకి విచ్చేసింది ఒసాకా. స్టయిల్ సింబల్‌గా పేరొందిన ఒసాకా 'ఆక్వా బ్లూ' అండ్ వైట్ లుక్‌లో కోర్టులోకి రావడం చూసి ప్రేక్షకులే కాదు కామెంటేటర్లు కూడా అవాక్కయ్యారు. తను అలా విభిన్న ఫ్యాషన్‌ను అనుసరించడం కొత్తేమీ కాదని తెలిసి.. 'వావ్.. నువ్వు ఎల్లప్పుడూ ప్రత్యేకంగా కనిపిస్తావు' అని అనుకున్నారు. కోర్టులో తన బెంచ్ వద్దకు చేరుకున్న ఒసాక.. ఛత్రీని, టోపీని తీసి పక్కన పెట్టింది. మేలి ముసుగును కూడా తీసేసి.. మ్యాచ్‌కు సిద్ధమైందీ ఆసియా సంచలనం.

## సంపాదకీయం

## నాణ్యతపై నియంత్రణ!

భారత్‌లో ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి) వైద్య విద్యా వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తోంది. అయితే ఈ విస్తరణకు నేతృత్వం వహిస్తున్నది ప్రధానంగా ప్రైవేటు రంగమే. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2024లో ఆయుర్వేద కాలేజీల్లో 86 శాతం, హోమియోపతి కాలేజీల్లో 85 శాతం ప్రభుత్వేతర సంస్థలవే. 2021-2024 మధ్య అనుమతించిన సీట్లు 43 శాతం, మొత్తం ప్రవేశ సామర్థ్యం 25 శాతం పెరగగా, ఈ కాలంలోనే ఆయుష్ విద్య, శిక్షణ, పరిశోధన, నవకల్పన, సామర్థ్య నిర్మాణం కోసం కేంద్రం కేటాయించే 'ఆయుర్-జ్ఞాన్' నిధులు దాదాపు ఆరు రెట్లు పెరిగాయి. అలోపతి వైద్య విద్యకు సంబంధించి ఇలాంటి ఆందోళనలు, విద్యార్థులకు ఆధారాధారిత వైద్య విధానంలో సరైన శిక్షణ లభిస్తోందా అన్న ప్రశ్నకే పరిమితమైనప్పటికీ, ఆయుష్ వ్యవస్థకు సంబంధించిన ప్రశ్నలు శిక్షణ నాణ్యతపైనే కాక, విద్యార్థులకు ఏం శిక్షణ ఇస్తున్నారన్న దానిపైనా కేంద్రీకృతమై ఉన్నాయి. అంటే, ఈ వ్యవస్థలో నాణ్యతా సమస్యలు ప్రస్తుత విస్తరణకు చాలాకాలం ముందునుంచే ఉన్నాయని గమనించడం ముఖ్యం. 2005 నాటి కాగ్ ఆడిట్‌లో, హోమియోపతి కాలేజీల్లో సరిపడా ఆసుపత్రి పడకలు, ఔట్‌పేషెంట్ సేవలు, సిబ్బంది లేకపోవడం విస్తృతంగా కనిపించింది. 2020 నాటి జర్నల్ ఆఫ్ ఆయుర్వేద అండ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్ కథనం కూడా, ఆనాటి ప్రమాణాల ప్రకారం అవసరమైన బోధనా సిబ్బందిలో అనేక సంస్థల్లో 50 శాతానికిపైగా కొరత ఉందని నివేదించింది. నియంత్రణ సంస్థ, జాతీయ భారతీయ వైద్య విధాన కమిషన్ (ఎన్‌సీఐఎస్‌ఎం), తనిఖీల్లో బోధనా సిబ్బంది బలం, మౌలిక సదుపాయాల్లో లోపాలు కనిపించిన తర్వాత తరచూ సంస్థలకు అనుమతి నిరాకరించడం లేదా నిలిపివేయడం చేస్తూ వచ్చింది. 2021లో పాత సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ (సీసీఐఎం) స్థానంలో ఏర్పడిన ఎన్‌సీఐఎస్‌ఎం, ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తూ, మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బంది, క్లినికల్ శిక్షణ, పరీక్షా ఫలితాల ఆధారంగా కాలేజీలను ఏ, బీ, సీ గ్రేడ్‌లుగా వర్గీకరిస్తోంది. ఇది పనిచేస్తున్న నియంత్రణ వ్యవస్థను చూపిస్తున్నా, ప్రైవేటు రంగం నేతృత్వంలోని విస్తరణ అదనపు ఆందోళనకు కారణమవుతోంది. ఎందుకంటే, బోధనా సిబ్బంది సంఖ్యను, ప్రయోగశాల మౌలిక సదుపాయాలను స్థిరంగా ఉంచుతూనే విద్యార్థుల ప్రవేశాలను గరిష్ఠీకరించాలన్న ప్రోత్సాహకాలు ఈ సంస్థలకు ఉన్నాయి. ఆగస్టు 21నాటికి, ఎన్‌సీఐఎస్‌ఎం అనుమతులు నిరాకరించిన 17 ఆయుర్వేద కాలేజీలను (అన్నీ ప్రయివేట్‌వే) జాబితా చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి మధ్యప్రదేశ్‌లోని 15 శాతానికిపైగా ప్రైవేటు ఆయుర్వేద కాలేజీలు గుర్తింపు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఇటీవలి నివేదికలు వెల్లడించాయి. బుర్హాన్‌పూర్, జబల్‌పూర్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద కాలేజీలు కూడా బోధనా సిబ్బంది, సదుపాయాల కొరతను ఎదుర్కొంటుండగా, విద్యార్థులు దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. హిల్‌సైడ్ ఆయుర్వేద మెడికల్ కాలేజీ (2023) కేసులో, "విద్యా సంస్థలు తరచూ ఆర్థిక లాభాల కోసం అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్చుకుంటున్నాయి" అని కర్ణాటక హైకోర్టు అంగీకరించింది. జాతీయ హోమియోపతి కమిషన్, మొత్తం హోమియోపతి కాలేజీల్లో 41 శాతానికి అత్యల్ప గ్రేడ్ ఇచ్చింది, అందులో దాదాపు సగం ప్రైవేటు సంస్థలే.

కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌సీఐఎస్‌ఎం నిబంధనలు, "కాగితాలకే పరిమితమైన బోధనా సిబ్బంది"ని భారీ జరిమానాలు, సీట్ల తగ్గింపుతో శిక్షిస్తుండటం గమనార్హం. పంజాబ్‌లోని పాటియాలా ప్రభుత్వ ఆయుర్వేద కాలేజీలో సిబ్బంది కొరత కారణంగా అండర్‌గ్రాడ్యుయేట్ సీట్లు 40నుంచి 28కి, పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్లు 8నుంచి 6కి తగ్గించారు. ఇది ప్రైవేటు సంస్థలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ కాలేజీల్లోనూ ఈ సమస్య వ్యాపించిందని స్పష్టం చేస్తుంది. గత దశాబ్దంలో ఈ కాలేజీకి నాలుగోసారి ప్రవేశాలకు అనుమతి నిరాకరించడం, 59 మంజూరైన బోధనా సిబ్బంది పోస్టుల్లో కేవలం ఒక్క రెగ్యులర్ టీచరే ఉండటం, పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది.

మరోవైపు, విస్తరణ కూడా వేగంగానే కొనసాగుతోంది. 2025-26 విద్యా సంవత్సరానికి 31 కొత్త ఆయుర్వేద కాలేజీలకు ఎన్‌సీఐఎస్‌ఎం అనుమతి మంజూరు చేయగా, ఇవి 2,600కుపైగా కొత్త బీఏఎంఎస్ సీట్లను జోడించనున్నాయి. వీటిలో మహారాష్ట్ర నుంచి 21 సంస్థలు ఉండటం గమనార్హం. ఆయుర్వేద అండర్‌గ్రాడ్యుయేట్ కాలేజీల సంఖ్యలో మహారాష్ట్రే దేశంలో అగ్రస్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్ ఉన్నాయి. ఇంత వేగంగా కొత్త కాలేజీలకు అనుమతులు ఇస్తూనే, ఇప్పటికే ఉన్న కాలేజీల్లో నాణ్యతా ప్రమాణాలను పటిష్ఠంగా అమలు చేయాల్సిన బాధ్యత కూడా నియంత్రణ సంస్థపై ఉంది. ఈ రెండు పరస్పర విరుద్ధమైన ధోరణులు.. వేగవంతమైన విస్తరణ, కఠినమైన నాణ్యతా నియంత్రణ ఏకకాలంలో సాగుతుండటం, ఆయుష్ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న మౌలిక సవాలును ప్రతిబింబిస్తుంది.

సారాంశంలో, ఆయుష్ విద్యా విస్తరణ, తగినంతగా లేని లేదా వివాదాస్పదమైన బోధనా సిబ్బంది బలం, తనిఖీ అవసరాల్లో వైఫల్యాలు, విద్యార్థుల ప్రవేశ సంఖ్యలు, కల్పిత బోధనా సిబ్బంది ఆరోపణలతో సహా నిరంతర నాణ్యతా సమస్యల మధ్యే జరుగుతోంది. కనిపిస్తున్న శరవేగవంతమైన విస్తరణ ఈ సమస్యలను తీవ్రతరం చేసిందని నిర్ధారణకు రావడం తొందరపాటే అయినా, నిరంతరంగా కొనసాగుతున్న నియంత్రణ ఉల్లంఘనలు కఠినమైన నాణ్యతా నియంత్రణను, ప్రైవేటు సంస్థలకు ఇస్తున్న ప్రోత్సాహకాలను పునఃపరిశీలించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు, ఆయుష్ వైద్య విధానాలకు మద్దతిచ్చే శాస్త్రీయ ఆధారాలపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేవలం కాలేజీల సంఖ్యను, సీట్ల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా మాత్రమే ఆయుష్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయలేం. బోధనా సిబ్బంది నాణ్యత, ఆసుపత్రి మౌలిక సదుపాయాలు, క్లినికల్ శిక్షణ, రోగుల భద్రత వంటి మౌలిక అంశాలపై కఠినమైన, స్థిరమైన నిఘా ఉంచడం అత్యవసరం. ప్రైవేటు రంగం విద్యా వ్యవస్థ విస్తరణలో కీలక పాత్ర పోషిస్తున్నా, లాభాపేక్షతో నాణ్యతను త్యాగం చేసే ధోరణిని అరికట్టాల్సిన బాధ్యత నియంత్రణ సంస్థలదే. చివరిగా, సాంప్రదాయ వైద్య విధానాలను ఆధునిక వైద్యశాస్త్ర ప్రమాణాలతో సమానంగా విశ్వసనీయంగా తీర్చిదిద్దాలంటే, కేవలం సంస్థాగత విస్తరణ సరిపోదు, దాని వెనుక పటిష్ఠమైన శాస్త్రీయ పరిశోధన, పారదర్శక మూల్యాంకనం, నిరంతర జవాబుదారీతనం కూడా అంతే అవసరం. ఆయుష్ వ్యవస్థపై ప్రజల విశ్వాసం, భవిష్యత్తులో దాని విస్తరణ రెండూ, ఈ నాణ్యతా ప్రమాణాలను ఎంత కచ్చితంగా అమలు చేస్తారన్న దానిపైనే ఆధారపడి ఉంటాయి!

## పనికొచ్చే పలుకు



## విత్తనమే విలువ.. పంట పర్యావసానమే!

"మీరు కోసే పంటను బట్టి కాకుండా, నాటే విత్తనాలను బట్టి ఆ రోజు విలువను అంచనా వేయండి". ఈ హితోక్తి చెప్పింది ప్రముఖ అమెరికన్ రచయిత విలియం ఆర్థర్ వార్డ్. ఈ మాటలు ఇప్పటికీ కోట్లాది మందికి మార్గదర్శకమే. విలియం ఆర్థర్ వార్డ్ (1921-1994) అమెరికాకు చెందిన ప్రముఖ స్ఫూర్తిదాయక రచయితల్లో ఒకరు. ఆయన తన జీవితకాలంలో 4,000 కంటే ఎక్కువ సందేశాత్మక వ్యాఖ్యలు రాశారు. ఈ వాక్యం మొదటిసారిగా మే 1963లో 'ఒక్లహోమా సిటీ స్టార్' పత్రికలో ప్రచురితమైంది. అయితే, రాబర్ట్ లూయిస్ స్టీవెన్సన్ అనే స్కాటిష్ రచయిత ఈ మాటలు చెప్పారని చాలామంది పొరబడుతుంటారు. కాని, ఆయన మరణించిన దశాబ్దాల తర్వాతే ఈ వాక్యం వెలుగులోకి వచ్చింది. వ్యవసాయ రంగాన్ని ఉదాహరణగా తీసుకుని వార్డ్ ఒక గొప్ప సూత్రాన్ని ఆవిష్కరించారు. పంట అనేది గతంలో చేసిన కష్టానికి లభించే తక్షణ ప్రయోజనం. కానీ విత్తనాలు నాటడమనేది భవిష్యత్తు విజయం కోసం చేసే నిశ్శబ్ద శ్రమ. "ప్రతి రోజూ పెద్ద విజయం సాధించలేకపోవచ్చు. కానీ భవిష్యత్తులో సాధించబోయే గొప్ప విజయాలకు పునాది వేసే రోజే నిజమైన మంచి రోజు" అని ఈ మాటలు స్పష్టం చేస్తున్నాయి.

సమాజంలో దీని ప్రాముఖ్యత

వెంటనే ఫలితాలు రావాలని కోరుకునే ధోరణి పెరుగుతున్న సమయంలో, పునాదుల నిర్మాణానికి పట్టే సమయాన్ని చాలామంది వృధాగా భావిస్తుంటారు. అయితే ఈనాటి విజయాలన్నీ గతంలో పడ్డ శ్రమ ఫలితమేననే విషయాన్ని గుర్తుంచుకోవాలి. కెరీర్, నైపుణ్యాలు లేదా మానవ సంబంధాలు వృద్ధి చెందడానికి నిరంతర నిబద్ధత అవసరం. ఫలితాలు నెమ్మదిగా వస్తున్నంత మాత్రాన ప్రగతి లేదని అనుకోవడం పొరపాటు.

ఈ మాటల ద్వారా నేర్చుకోవాల్సిన పాఠాలు

కనిపించని శ్రమకు విలువ ఇవ్వండి: విత్తనం నాటిన రోజే పంట చేతికి రాదు. ఫలితం వెంటనే కనిపించకపోయినా శ్రమ ఎప్పటికీ వృధా పోదు.

సుదీర్ఘ ప్రయాణానికి సిద్ధపడండి: శ్రమ అనేది రోజురోజుకూ తోడవుతూ పోతుంది. కాలానుగుణంగా అది పెద్ద ఫలితాన్ని ఇస్తుంది.

నిలకడతో కూడిన ప్రయత్నం: ఒక్క విత్తనంతో మార్పు రాదు. రోజురోజుకూ ప్రయత్నాలు పెంచుకుంటూ పోతేనే భవిష్యత్తులో ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయి.

పనిపై మాత్రమే దృష్టి పెట్టండి: ఫలితాలు ఎప్పుడూ మన చేతుల్లో ఉండవు. కానీ మనం చేసే ప్రయత్నం, అనుసరించే విధానం పూర్తిగా మన నియంత్రణలోనే ఉంటాయి.

గుర్తుంచుకోండి -ప్రతి రోజూ కోత కోయడానికి పంట ఉండకపోవచ్చు. కానీ ప్రతి రోజూ ఒక విత్తనం నాటే అవకాశం మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది. మనం ఇవాళ నాటే చిన్న ప్రయత్నమే, రేపటి పెద్ద విజయానికి పునాది. ఫలితం ఆలస్యమైందని నిరాశపడకండి, ఎందుకంటే ప్రకృతిలో ఏదీ తొందరపడి పండదు. మీ శ్రమను ఎవరూ చూడకపోయినా, అది ఎప్పటికీ వృధా కాదు. గమ్యం కంటే, ఆ దిశగా మీరు వేసే ప్రతి అడుగే నిజమైన విలువ. కాబట్టి, పంటను చూసి కుంగిపోకండి. విత్తనాన్ని నమ్మి ముందుకు సాగండి. అదే నిజమైన విజేత లక్షణం!

# మేఘాల్లో చదువులు! మట్టిలో బడులు!!

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ యువతను దృష్టిలో ఉంచుకుని రెండు కీలక ప్రకటనలు చేశారు. పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్, వచ్చే ఏడాదిలో కోటిమంది యువ భారతీయులకు కృత్రిమ మేధ (ఏఐ)లో శిక్షణ ఇచ్చే కార్యక్రమం. దేశవ్యాప్తంగా యువత ఆందోళనలు వారి ఆకాంక్షలను, అసంతృప్తిని ప్రత్యక్షంగా బయటపెట్టిన తరుణంలోనే ఈ హామీలు వచ్చాయి. జేఈఈ, నీట్‌వంటి తీవ్ర పోటీగల పరీక్షల కోసం కుటుంబాలు భారీగా ఖర్చు చేస్తున్న దేశంలో, ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఖచ్చితంగా మార్పు తీసుకురాగలదు. ఏఐ ప్రాధాన్యత పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ కోసం యువతను సిద్ధం చేయాల్సిన అవసరం కూడా ఉంది. అయితే, ఇదే నెలలో దేశంలోని పలు ప్రాంతాల్లో పాఠశాల విద్యార్థులు మరింత ప్రాథమికమైన డిమాండ్‌ను ముందుకు తెచ్చారు, "పనిచేసే బడి కావాలి" అని. ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో విద్యార్థులు ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. ఫిర్యాదులు పట్టించుకోకపోవడంతో ఒక సందర్భంలో మంత్రి కాన్వాయ్‌నే అడ్డుకున్నారు. ఉపాధ్యాయులు, బడికి వేసిన రోడ్లు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, సురక్షితమైన తరగతి గదులు వంటివి వారి డిమాండ్లలో ఉన్నాయి. 2025 జులైలో రాజస్థాన్ ఝులావర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల పైకప్పు కూలిపోయి ఏడుగురు విద్యార్థులు మృతిచెందారు, మరికొందరు గాయపడ్డారు. ఈ విషాదం రాష్ట్రవ్యాప్త భద్రతా ఆడిట్‌కు దారితీసి, వేలాది అసురక్షిత, శిథిల పాఠశాలలను గుర్తించింది. ఇటీవల వార్తల్లోకెక్కిన రాజస్థాన్‌లోని రాంపురా-కన్వార్‌పురా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కూడా 2025 సెప్టెంబర్‌లో శిథిలంగా వర్గీకరించబడిన వాటిలో ఒకటి. అప్పటినుంచి పిల్లలు ఆవుల కొట్టంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. తాత్కాలికమని భావించిన ఈ ఏర్పాటు దాదాపు ఏడాదిపాటు కొనసాగింది, చివరకు యువత నేతృత్వంలోని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) బృందం అక్కడికి చేరుకుంది. వారి 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారంలో భాగంగా ఈ పాఠశాలను పరిశీలించడానికి వెళ్లిన బృందంపై గ్రామస్తులు దాడి చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అయితే, ఈ ఒత్తిడి తక్షణ ఫలితాన్నిచ్చింది. 18మంది పిల్లలు ఇప్పుడు ఆవుల కొట్టంనుంచి బయటపడ్డారు, కొత్త పాఠశాల భవనం నిర్మిస్తామన్న హామీ లభించింది.

పిల్లలు ఆవుల కొట్టంలో చదువుకోవడాన్ని, ఏఐ-నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని సృష్టించాలన్న జాతీయ ఆకాంక్షతో ఎలా సమన్వయం చేయగలం? మరో ముఖ్యమైన అంశం -కోటి మంది యువతకు ఏఐలో శిక్షణ ఇవ్వడమంటే ఏమిటో ఇంకా పూర్తి స్పష్టత లేదు. వారు ఏం నేర్చుకుంటారు? ఎవరు అర్హులు? ఎంతస్థాయి శిక్షణ ఉద్దేశించారు? మూల్యాంకనం ఎలా జరుగుతుంది? లక్ష్యం ప్రాథమిక ఏఐ అక్షరాస్యతా, లేక ఉద్యోగ ఆధారిత సాంకేతిక నైపుణ్యాలా? ఈ తేడా ముఖ్యమైనది. భారత్‌లో ఇప్పటికే 'యువ ఏఐ ఫర్ ఆల్' అనే మౌలిక ఏఐ అక్షరాస్యతా కార్యక్రమం ఉంది. ఇది ఏఐ అంటే ఏమిటో, దాన్ని ఎలా బాధ్యతాయుతంగా వాడాలో తెలియజేయడానికి రూపొందించారు. కానీ మౌలిక ఏఐ అక్షరాస్యత, కోటిమందిని ఏఐ ఇంజినీర్లుగా లేదా ఉద్యోగ-సన్నద్ధ సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దడంకంటే పూర్తి భిన్నమైనది. ఈ హామీ స్వాగతించదగినదే, అయితే దాని కార్యాచరణ వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ డిజిటల్ భవిష్యత్తులోకి ప్రవేశిస్తున్న యువతకు ఎలాంటి విద్యా పునాది లభిస్తోంది అన్నది కూడా అంతే ముఖ్యమైన ప్రశ్న. ఆన్‌లైన్ కోచింగ్ తరగతికి ఒక పరికరం, విద్యుత్, కనెక్టివిటీ, చదువుకోవడానికి ప్రశాంతమైన స్థలం, బోధన నుంచి ప్రయోజనం పొందడానికి తగినంత మౌలిక జ్ఞానం అవసరం. తీవ్రమైన ఏఐ శిక్షణకు ఇంకా ఎక్కువ అవసరం. అధునాతన సాంకేతికతతో పనిచేయడానికి ముందు, పిల్లలు నమ్మకంగా చదవగలగాలి, గణితాన్ని అర్థం చేసుకోగలగాలి, తార్కికంగా ఆలోచించగలగాలి, సొంతంగా సమస్యలను పరిష్కరించగలగాలి. ఇక్కడే భారత పాఠశాలలు కీలకంగా మారతాయి. ఇటీవలి నీతి ఆయోగ్ నివేదిక, ఏఎస్ఈఆర్ డేటాను ఉటంకిస్తూ, కనీసం ప్రాథమిక వ్యవకలన సమస్యను పరిష్కరించగల మూడో తరగతి పిల్లల శాతం 2014లో 25.4 శాతం నుంచి 2024కి 33.7 శాతానికి పెరిగిందని పేర్కొంది. అయినా దాదాపు మూడింట రెండొంతుల మంది ఇప్పటికీ దీన్ని చేయలేకపోతున్నారు. పాఠశాలలు అంటే హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రెండూ కావాలి. భవనాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, విద్యుత్, నీరు, రోడ్లు, ఫ్యాన్లు, డిజిటల్ పరికరాలు హార్డ్‌వేర్‌ను నిర్మిస్తే, ఉపాధ్యాయులు, బోధనా నాణ్యత, అభ్యాస సామగ్రి, పిల్లలకు బోధించే వాతావరణం సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తాయి. ఉపాధ్యాయులు లేకుండా, సరిగ్గా సన్నద్ధం కాకుండా, సమర్థంగా బోధించలేకుండా ఉంటే, రంగురంగుల పాఠశాల భవనం మంచి అభ్యాస ఫలితాలను ఇవ్వదు.



ఏఐ పోటీలో ఆధిపత్యం చెలాయిస్తున్న రెండు దేశాలను - అమెరికా, చైనాను పరిశీలిస్తే, అవి రెండు పూర్తి భిన్నమైన మార్గాలను అనుసరించాయని అర్థమవుతుంది. అమెరికా వద్ద అపారమైన వనరులున్నాయి, ఇతర దేశాల్లో శిక్షణ పొందిన ప్రతిభను -భారత్‌కు చెందిన అత్యంత నైపుణ్యం కలిగిన గ్రాడ్యుయేట్లతో సహా విస్తృతంగా ఉపయోగించుకోగలిగింది. కానీ భారత్ పరిమాణంగల దేశం, కేవలం చిన్న ఉన్నత వర్గాన్ని విద్యావంతులను చేసి, తన అత్యంత ప్రతిభావంతులైన వ్యక్తుల్లో అధిక సంఖ్యాకులు మెరుగైన నిధులు కలిగిన విశ్వవిద్యాలయాలు, ప్రయోగశాలలు, కంపెనీలకు వలస వెళ్లడాన్ని చూస్తూ కూర్చోవడం ద్వారా తన సాంకేతిక భవిష్యత్తును నిర్మించలేదు. చైనా వేరే మార్గాన్ని అనుసరించింది. ఉన్నత సంస్థలతోపాటు సామూహిక విద్యను నిర్మించడం, తన శాస్త్రీయ, సాంకేతిక పునాదిని విస్తరించడం, పరిశోధన, సాంకేతిక సామర్థ్యంలో భారీగా పెట్టుబడి పెట్టడం. కొన్ని ఉన్నత సంస్థలు అకస్మాత్తుగా ప్రపంచస్థాయికి ఎదగడం వల్ల చైనా ఏఐ శక్తిగా ఆవిర్భవించలేదు. పాఠశాలలతో ప్రారంభమయ్యే విస్తృత విద్యా, సాంకేతిక సామర్థ్య సంచయనంపైనే అది ఆధారపడింది. ఇదే భారత్ ఎదుర్కోవాల్సిన విషయం. నాసిరకం విద్యా సముద్రం మధ్యలో ఉన్న శ్రేష్ఠత ద్వీపంపై ఏఐ అగ్రరాజ్యాన్ని నిర్మించలేం. శిఖరం ముఖ్యమే, పునాది కూడా అంతే ముఖ్యం. భారత్‌కు ఐఐటీలు, ఐఐఎస్‌సీ వంటి అద్భుతమైన సంస్థలున్నాయి. అవి అసాధారణ ప్రతిభను తయారు చేశాయి. కానీ సాంకేతిక అగ్రరాజ్యంగా ఎదగాలని ఆకాంక్షించే దేశాలు, అసాధారణ సంస్థలు, వ్యక్తుల సన్నని పొరపైనే శాశ్వతంగా ఆధారపడలేవు. విజయవంతమైన దేశాలు ప్రాథమిక విద్యలో పెట్టుబడి పెడతాయి. ఎందుకంటే సాంకేతికత అంతిమంగా మానవ సామర్థ్యంపైనే ఆధారపడి ఉంటుంది. ఏఐ ప్రోత్సాహం అక్షరాస్యత, గణిత సామర్థ్యం, తార్కికత, మంచి ఉపాధ్యాయుల అవసరాన్ని తొలగించదు. దానికి ప్రీమియంను మరింత పెంచుతుంది. భారత్‌కు రెండు దార్శనికతలూ అవసరం. యువతకు కొత్త సాంకేతికతల్లో శిక్షణ ఇవ్వాలన్న ఆకాంక్ష, ఆ భవిష్యత్తుకు దారితీసే పాఠశాలలను సరిచేయాలన్న సంకల్పం. భారత్ యువతను క్లౌడ్‌లోకి పంపాలనుకుంటోంది. కానీ ఆ పిల్లవాడు ఇంకా ఆవుల కొట్టంలోనే కూర్చుని ఉంటే ఏమవుతుంది? ■



చాలామంది ఆర్థిక విజ్ఞానం అంటే కేవలం ఎక్కువ విషయాలు తెలుసుకోవడమే అనుకుంటారు. కానీ అది మన రోజువారీ నిర్ణయాలను సరిగా తీసుకోవడంపై ఆధారపడి ఉంటుంది. ఆలోచించి ఖర్చు చేయడం, చిన్న ఆర్థిక సమస్యలు పెద్దవి కాకముందే పరిష్కరించుకోవడం, నేర్చుకున్న విషయాలను అలవాట్లుగా మార్చుకోవడం, భవిష్యత్తును బలపరిచే నిర్ణయాలపై దృష్టి పెట్టడమే అసలైన ఆర్థిక విజ్ఞానం. ఆర్థిక విజ్ఞానం అంటే తెలుసుకున్నది కాదు, ఆచరించి అలవాటుగా మార్చుకున్నదే. చిన్న సరైన నిర్ణయాలే మీ ఆర్థిక భవిష్యత్తుకు నిజమైన పునాది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

## ఏఐకి కనిపించని కళంకిత చొక్కా!



జర్మనీ డిజైనర్ సైమన్ వెకర్ట్ రూపొందించిన 'డిజిటల్ కామోఫ్లాజ్' చొక్కా చూడటానికి వికారంగా, గజిబిజిగా కనిపించే హవాయియన్ షర్ట్‌లాగే ఉన్నా, దీని వెనుక ఒక ప్రత్యేక ఉద్దేశం దాగివుంది. కృత్రిమ మేధ ఆధారిత సీసీటీవీ కెమెరాలు ధరించిన వ్యక్తిని మనిషిగా గుర్తించకుండా చేయడమే దీని లక్ష్యం. "ఏఐ వ్యవస్థలు మనిషి అంటే ఏమిటో నేర్చుకోలేదు, లక్షలాది శిక్షణా చిత్రాల్లో మనుషులు గణాంకపరంగా ఎలా కనిపిస్తారో మాత్రమే నేర్చుకున్నాయి" అని వెకర్ట్ వివరించారు. అంచులు, కాంట్రాస్ట్‌లు, ఆకృతి ప్రవణతలను బట్టి, తలభుజాల ఆకృతి, శరీర నిష్పత్తులను బట్టి యంత్రం మనిషిని గుర్తిస్తుందని, అదే దాని బలహీనతని ఆయన చెప్పారు. ఆసక్తికరంగా, ఈ నమూనాను రూపొందించడానికి కూడా ఏఐనే వాడారు. 'అడ్వర్సేరియల్ లూప్' అనే ప్రక్రియ ద్వారా, డిటెక్షన్ వ్యవస్థకు ఒక నమూనాను చూపించి, అది ఎంత విశ్వాసంతో మనిషిని గుర్తిస్తుందో కొలిచి, ఆ విశ్వాసం పూర్తిగా కుప్పకూలేవరకూ దాన్ని సవరిస్తూ పోయారు. మనుషులకు మాత్రం ఈ రంగురంగుల, దాదాపు హిప్నాటిక్ నమూనా కళ్లకు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కానీ ఏఐ కెమెరాలకు మాత్రం అది ఏమీ లేనట్టుగానే నమోదవుతుంది!

పెన్ సత్తా

బుధవారం 2 సెప్టెంబర్ 2026






## రష్మిక నుంచి బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు.. మైసా రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇప్పటికే విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను మరింత పెంచుకుంటున్న ఈ భామ.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రష్మిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ 'మైసా' విడుదల తేదీ ఖరారైంది. 'మైసా' చిత్రాన్ని 2026 నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా రష్మిక చేతిలో ఈటె పట్టుకుని, అత్యంత పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించే ఇంటెన్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఇప్పటివరకు గ్లామర్, లవ్, ఫ్యామిలీ, కామెడీ వంటి విభిన్న పాత్రల్లో కనిపించిన రష్మిక.. 'మైసా'లో మాత్రం పూర్తిగా భిన్నమైన అవతార్‌లో కనిపించనుంది. ఇందులో ఆమె గోండ్ గిరిజన మహిళ, తిరుగుబాటుదారిణి పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. పాత్ర కోసం రష్మిక తన లుక్, బాడీ లాంగ్వేజ్‌లోనూ భారీ మార్పులు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. 'మైసా' కథ గిరిజన ప్రాంతాల నేపథ్యంలో సాగుతుందని తెలుస్తోంది. అక్కడి ప్రజల జీవన విధానం, వారి నమ్మకాలు, సమస్యలు, పోరాటం వంటి అంశాలను కథలో చూపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా రష్మిక పాత్ర చుట్టూనే కథనం ఎక్కువగా నడుస్తుందని టాక్. ఈ సినిమాలో రష్మిక ఇప్పటివరకు చేయని యాక్షన్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించనుంది. చేతిలో ఈటె పట్టుకుని కనిపిస్తున్న పోస్టర్ చూస్తే.. సినిమాలో ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతోంది. ఈ సినిమా కోసం రష్మిక అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'మైసా'తో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అనిల్, అజయ్ సయ్యపురెడ్డి, శ్రీకాంత్ సాతి కలిసి అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నారు. కథకు తగ్గట్టుగా భారీ యాక్షన్ సన్నివేశాలు, గిరిజన నేపథ్యాన్ని ప్రతిబింబించే విజువల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే రష్మికకు 2026 చివరి రెండు నెలలు మరింత ప్రత్యేకంగా మారనున్నాయి. ఇప్పటికే విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబలి' చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ తర్వాత కేవలం 42 రోజుల వ్యవధిలోనే 'మైసా' నవంబర్ 27న విడుదల కానుంది.

## 'కల్కి2'పై బిగ్ అప్‌డేట్..!





దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కిన పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఐయామ్ ది గేమ్'. ఈ చిత్రం సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. వేఫెరర్ ఫిలిమ్స్ సమర్పణలో నహాస్ హిదాయత్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కల్కి2'కి సంబంధించిన అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఇప్పుడీ వీడియో వైరల్ అవుతోంది.

'ఇప్పటివరకు పది రోజుల షూటింగ్ చేశాం. ఇంకా చాలా చేయాల్సి ఉంది. ప్రభాస్‌కు సమయం దొరకపోవడంతో లేట్ అవుతుంది. అతనికి సమయం దొరికాక పెద్ద షెడ్యూల్ ప్లాన్ చేస్తాం' అని వెల్లడించారు.

2024లో విడుదలై..

కాగా ప్రభాస్ – నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'కల్కి 2898 ఏడీ'. 2024 జూన్ 27న విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1100 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశాపటానీ, దీపికా పదుకొణె కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడు 'కల్కి2' కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ తరహాలో 'కల్కి2'కి సంబంధించిన అప్‌డేట్ అభిమానుల్లో ఉత్సాహన్ని నింపుతోంది.

## దుల్కర్ సల్మాన్ 'ఐయామ్ గేమ్'కు లెంగ్తీ రన్ టైం..!

దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న యాక్షన్ థ్రిల్లర్ ఐయామ్ గేమ్. నిహాస్ హిధయత్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 20న విడుదల కావాల్సింది. కానీ పలు కారణాల వల్ల సెప్టెంబర్ 3 ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఒకేసారి పలు ప్రధాన భాషల్లో విడుదల కానుంది. ఐయామ్ గేమ్ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ యూ/ఏ 16ం సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ చిత్రానికి రన్ టైం 173 నిమిషాలు (2 గంటల 57 నిమిషాలు). రన్ టైం ఎక్కువ కావడం కారణంగా ఆడియెన్స్‌ను ఎంగేజ్ చేయాలంటే స్టోరీ, స్క్రీన్ ప్లే చాలా కీలకం. మరి డైరెక్టర్ లెంగ్తీ రన్ టైం సినిమా చూసేలా ప్రేక్షకులను ఎలా కుర్చీలకు కట్టిపడేస్తాడో చూడాలి. ఈ చిత్రంలో కయాదు లోహర్, ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కథిర్, సంయుక్తా విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





## 'ఇరుముడి'తో రవితేజ.. 'మారెమ్మ'తో తమ్ముడి కొడుకు

'ఇరుముడి' హిట్ కొట్టిన రవితేజ మంచి జోష్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఇతడి ఇంటి నుంచి మరో హీరో రాబోతున్నాడు. రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ ప్రధాన పాత్ర చేసిన 'మారెమ్మ' విడుదలకు సిద్ధమైంది. వచ్చే శుక్రవారం(సెప్టెంబరు 10) ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ వదిలారు. ఇది ఆకట్టుకునేలా ఉంది. గతంలో 'లవ్ యూ ఇడియట్' అనే మూవీలో మాధవ్ హీరోగా పరిచయమయ్యాడు. కానీ ఇదొచ్చిందా లేదా అనే సంగతి జనాలకు పెద్దగా తెలీదు. తర్వాత విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే 'మారెమ్మ' ఒప్పుకొన్నాడు. ఏడాది క్రితం దీని గురించి ప్రకటన వచ్చింది. కొన్నిరోజుల క్రితం మూవీ రిలీజ్ డేట్ ప్రకటించారు. ఇప్పుడు ట్రైలర్ విడుదల చేశారు. మారెమ్మ అనే గ్రామ దేవత, ఈ దేవి కోసం పెంచే ఓ దున్నపోతు. దాన్ని కాపాలా కాసే ఓ కాపరి. ఊరిలో జరిగే కొన్ని అరిష్టాలు. ఇలా ట్రైలర్ సాగింది. తెలంగాణలోని ఓ పల్లె నేపథ్యంగా మూవీ ఉండనుంది. ఇందులో మాధవ్ సరసన దీపా బాలు హీరోయిన్‌గా చేసింది. మంచాల నాగరాజు దర్శకుడు. ఈ సినిమాతోనైనా మాధవ్ హీరోగా సక్సెస్ అందుకుంటాడేమో చూడాలి?

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com